# జనబలం

ప్రజలే ప్రభువులు

డిసెంబర్ 2024 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-



## అమెరికా - గందరగోళం





## కులగణన- రిజర్వేషన్లు

## రేవంత్ @ 1



## సంక్షోభాన్ని అవకాశంగా మలచగలమా?

## మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు





హైదరాబాద్ బోడుప్పల్‌లోని పల్లవి మోడల్ స్కూల్ వార్షికోత్సవంలో
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు
డాక్టర్ జయప్రకాష్ నారాయణ్











ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

డిసెంబర్ 2024

సంపుటి 26 సంచిక 12


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్





05 మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు

07 అమెరికా గందరగోళం - ప్రపంచంపై పర్యవసానాలు

14 రేవంత్ పాలన@1

21 సంక్షోభాన్ని మనం అవకాశంగా మలచగలమా?

23 కొరవడిన సం'క్షేమం'



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# రాజ్యాంగం - 75 వసంతాలు

నవంబర్ 26న దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నాం. రాజ్యాంగాన్ని ఘనంగా అమలుపరచుకుంటున్నామని ప్రస్తుతం అధికారంలో ఉన్న జాతీయస్థాయి ప్రభుత్వం చెబుతోంది. ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మాత్రం రాజ్యాంగ హననం జరుగుతోందని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ పాలన సాగిస్తోందని విమర్శిస్తోంది.

ఇంతకీ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతున్నది ఎవరు? ధ్వంసం చేస్తున్నది ఎవరంటే తిలా పాపం తలా పిడికెడు అని చెప్పవచ్చు. ఇప్పటివరకు దేశాన్ని సుమారు 55 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ పాలించింది. 1977 నుంచి 80 వరకు మొట్టమొదటి కాంగ్రెసేతర పార్టీ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 90వ దశకంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ప్రభుత్వం మొదటిసారి 13 రోజుల స్వల్ప వ్యవధిలో కూలిపోయి తర్వాత రెండోసారి ఐదేళ్లపాటు అధికారంలో ఉంది. 2014 నుండి ఇప్పటివరకు సుమారు 10 సంవత్సరాల పాటు నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది.

భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండి మొదలుకొని ప్రస్తుత 18వ లోక్‌సభ వరకు వరుసగా లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు. మన్మోహన్‌సింగ్ ఈ ఆరుగురు ప్రధానులే సుమారు ఆరు దశాబ్దాలు పాలించారు. అందులో సింహభాగం జవహర్‌లాల్ నెహ్రూ 17 సంవత్సరాలు, ఇందిరా గాంధీ మరో 15 సంవత్సరాలు పరిపాలించారు. మన్మోహన్ సింగ్ 10 సంవత్సరాలు, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు చెరో ఐదు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రధాన మంత్రులుగా వ్యవహరించారు. ఇక మిగిలిన కాలంలో జనతా ప్రభుత్వం మూడేళ్లు, వాజ్‌పేయి ఐదేళ్లు, ప్రస్తుత ప్రధానమంత్రి గత పదేళ్లుగా కాంగ్రెసేతర ప్రధాన మంత్రులుగా ఉన్నారు.

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి ఇప్పటికీ 77 సంవత్సరాలు పూర్తయింది. ఈ 77 సంవత్సరాలలో పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీతో సహా తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు రాజ్యాంగ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని వ్యవహరించాలన్న ఆలోచన చేశాయి. ఆనాడు ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ మొదలు ఈనాడు అప్రకటిత ఎమర్జెన్సీ నడుపుతున్నారని విమర్శలు ఎదుర్కొంటున్న మోదీ ప్రభుత్వంతో సహా విమర్శలు ఎదుర్కొంటున్నాయి. మన భారత రాజ్యాంగం ఉత్కృష్టమైనది కనుక పాలకుల ఆటలు కొంతవరకు సాగినా మన ప్రజాస్వామ్యంలో ఉన్న మౌలిక సూత్రాలు, రాజ్యాంగంలో పొందుపరిచిన స్ఫూర్తి మన భారతదేశ ప్రజలను రక్షిస్తుంది. రాజ్యాంగంలోని చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ, స్వతంత్ర న్యాయవ్యవస్థ ఒకరి పనుల్లో మరొకరు జోక్యం చేసుకోకుండా నడుస్తుంది కనుకనే ఈ విజయాన్ని మనం సాధించగలిగాము.

భారత ప్రజలమైన మేము అని మనకు మనమే సమర్పించుకున్న ఈ రాజ్యాంగం విఫలం కాలేదు. మన రాజ్యాంగం ఒకవేళ భవిష్యత్తులో విఫలమైతే రాజ్యాంగం తప్పు కాదు దానిని అమలు చేసేవారి తప్పు అన్న అంబేద్కర్ మాటలను తార్కాణంగా భావించాలి. భారతదేశ రాజ్యాంగం తయారు చేసుకున్నాము కానీ రాజ్యాంగం అనే గుడిలో దేవతను ప్రతిష్ఠించేలాగా దెయ్యాలు కూర్చుంటే మనం ఏమీ చేయలేము అని ఆనాడే అంబేద్కర్ అన్నారు.

మనం కాలానుగుణంగా సవరణ ద్వారా భారత రాజ్యాంగంలో సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలను చేర్చు కున్నాము. ఇప్పటివరకు రాజ్యాంగంలో 106 సవరణలు చేసుకున్నాం. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చ కూడదని కేశవానంద భారతి, గోలక్నాథ్ కేసుల్లో భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అలా అని అంతా సజావుగా ఉందని చెప్పలేం. మన ప్రజాస్వామ్యంలో లోపాలు లేవని కాదు. ప్రజా స్వామ్యంలో ఎన్ని లోపాలున్నా మరింత ప్రజాస్వామ్యమే మంచి మందు అని భారత ప్రజలు భావించినన్ని రోజులు మన ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి వచ్చిన ముప్పు ఏమీ లేదనిపిస్తుంది. చరిత్ర నిర్మాతలు నాయకులు, పార్టీలు కాదు ప్రజలే అన్న నిజం మనం మరవరాదు.

–బండారు రామ్మోహనరావు

# మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఉన్నంతలో మెరుగైన ఎజెండాకు ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ తదితర పార్టీల కూటమికి పట్టం కట్టారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ భాగస్వామ్య కూటమికి పెద్ద ఎత్తున మెజారిటీ ఇచ్చిన మహారాష్ట్ర కొన్ని నెలల వ్యవధిలోనే అందుకు విరుద్ధంగా తీర్పునివ్వడంపై జేపీ స్పందిస్తూ.. ప్రజలు అసెంబ్లీకి, లోక్‌సభకు వేర్వేరుగా ఓటు వేసే ప్రజాస్వామ్య పరిణతి ఇంకా మన దేశంలో వచ్చిందని తాను భావించటం లేదని, అయితే ప్రధానమంత్రిగా బలమైన నాయకుడు, యూనియన్‌లో మెరుగైన ప్రభుత్వం ఉన్నప్పుడు శాసనసభ కన్నా కొంత ఎక్కువ ఓట్లు ఆ పార్టీకి లోక్‌సభ స్థానాల్లో వచ్చే అవకాశముందని, ఆ ఆనవాయితీ ఈ సారి మహారాష్ట్రలో కనిపించలేదన్నారు.



ప్రజాభిప్రాయం కొన్ని నెలల్లో మారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భాగస్వామ్య మహాయుతి కూటమి ప్రభుత్వానికి భారీ మెజార్టీ రావటానికి మూడు ప్రధాన కారణాలున్నట్టు భావిస్తున్నట్లు జేపీ తెలిపారు.

మొదటిది, ఆచరణసాధ్య సంక్షేమ పథకాలను ఎన్నికలకు మూడు నెలల ముందు బీజేపీ కూటమి ప్రభుత్వం అమలు చేసింది. ఆర్థికంగా దివాలా తీసిన ఆంధ్రప్రదేశ్‌లో కనీస పెన్షన్ రూ. 4,000 కాగా, 42 లక్షల కోట్ల జీఎస్‌డీపీతో ఏపీ కంటే ఆర్థికంగా ఎంతో బలమైన మహారాష్ట్రలో ప్రభుత్వం మహిళలకు పెన్షన్‌ను ఈసారి కేవలం రూ. 2,100కి పెంచింది. మహారాష్ట్ర అప్పులు కూడా ఏపీతో పోలిస్తే తక్కువగా జీఎస్‌డీపీలో 20శాతం లోపే ఉన్నాయి. కాబట్టి సంక్షేమాన్ని అభివృద్ధికి విఘాతం కలగకుండా గట్టిగా, ఆచరణ సాధ్యంగా అమలు చేసి ప్రజలను ఆకట్టుకుందని జేపీ పేర్కొన్నారు.

రెండోది, మనకిష్టమున్నా లేకున్నా ఇప్పుడు గెలిచిన వారు సమర్థంగా సామాజిక సమీకరణ చేశారని జేపీ తెలిపారు. అక్కడ మరాఠాలు రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్నారు. అది తెలుగు రాష్ట్రాల్లో కమ్మ, రెడ్డి, కాపు, వెలమ లాంటి ఆర్థికంగా మెరుగైన స్థానాల్లో ఉన్న కులాల వారు రిజర్వేషన్లు కోరటం లాంటిది. తెలుగు రాష్ట్రాల్లో ఆ సామాజిక వర్గాలు రిజర్వేషన్లు కోరకుండా కొంత సంయమనాన్ని పాటిస్తుండగా, మహారాష్ట్రలో మరాఠాలు అందుకోసం పెద్ద ఉద్యమమే నిర్మించారు. ఇది అక్కడి బలహీనవర్గాలను ఆందోళనకు గురిచేసింది. ఆ కులాల్ని బీజేపీ సమర్థంగా కలపగలిగి. రాజకీయంగా వారికి స్థాయిని కల్పించింది. అది కూడా మరాఠా ఓట్లు ఎక్కువ కోల్పోకుండా చేయగలిగింది. అదే విధంగా లోక్‌సభలో 400 సీట్లు వస్తాయన్న ప్రచారం, బీజేపీకి అన్ని సీట్లు వస్తే రాజ్యాంగాన్ని రద్దుచేసి రిజర్వేషన్లు లేకుండా చేస్తుందన్న ప్రచారం వల్ల కలిగిన అపోహల్ని, నష్టాల్ని గత కొన్ని నెలల్లో తొలగించుకోగలిగింది. దీంతో బలహీనవర్గాలు బీజేపీ వైపు గణనీయంగా మొగ్గు చూపారు.

మూడోది, బీజేపీ మహాయుతి కూటమిలోని పార్టీల మధ్య పొరపొచ్చాలు లేకుండా ఓట్ల బదలాయింపు సజావుగా జరిగేలా నాయకత్వం వ్యవహరించగలిగింది.

అదే విధంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ కూటముల మధ్య ఓట్ల తేడా సుమారు 1.3 శాతం మాత్రమేనని, పరిస్థితి మారగానే 15-16 శాతం ఓట్ల తేడా వచ్చి మన ఎఫ్.పి.టి.పి ఎన్నికల వ్యవస్థలో ఫలితాలు ఏకపక్షమయ్యాయన్నారు.

బీజేపీ భాగస్వామ్య కూటమి ఆచరణసాధ్యంగా తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలు హామీ ఇవ్వగా, కాంగ్రెస్ భాగస్వామ్య కూటమి ఏడాదికి రూ. 1,76,000 కోట్ల భారం పడే పథకాలు హామీ ఇచ్చిందని రూ. 2,50,000 ఉద్యోగాలిస్తామని ప్రకటించిందని జేపీ అన్నారు. పదికోట్ల జనాభా ఉన్న రాష్ట్రంలో రెండున్నర లక్షల ప్రభుత్వోద్యోగాలు ఏ రకంగానూ నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కాదు. అది ప్రమాదకరమైన భ్రమ.

అదే విధంగా ఉద్యోగాల్లో 3 శాతం మాత్రమే ఉన్న ప్రభుత్వోద్యోగులకు ఖజానా మీద విపరీత భారం పడే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)కి కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కులగణన నినాదం ఇచ్చింది తప్ప అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం ఇచ్చే ప్రయత్నం చేయలేదు. ప్రజలు





కులవివక్ష పోవటానికి కొన్ని రాయితీలను కోరుతున్నారు తప్ప కులాన్ని కొనసాగించాలని కోరుకోవడం లేదు. బీజేపీ కనీసం ఆర్థిక విషయాల్లో విజ్ఞతను ప్రదర్శించి అణగారిన వర్గాలకు ఆచరణలో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిందని ప్రజలు ఇందుకు సానుకూలంగా స్పందించారని జేపీ వివరించారు.

**పార్టీలు సొంత ఆస్తులు కాదు**

ఉద్ధవ్ ఠాక్రే, శరద్‌పవార్ పార్టీల చీలికలపై కూడా జేపీ స్పందించారు. పార్టీ మా తాతది, నేను పార్టీ వ్యవస్థాపకుడ్ని కాబట్టి నాదే కిరీటం అనే ధోరణి ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. కూటమిగా గెలిచిన బీజేపీతో కొనసాగుదామని మెజార్టీ ఎమ్మెల్యేలు కోరినా, ఆ పార్టీతోనే శివసేనకు ఎక్కువ సాపత్యముందని వారు స్పష్టం చేసినా వినకుండా ఉద్ధవ్‌ఠాక్రే పార్టీ తన సొంతమన్నట్లు వ్యవహరించారన్నారు. అది కరెక్టా? కాదా? అని ప్రజలు తేలుస్తారని, అయితే పార్టీలో ఎక్కువ మంది సభ్యులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తే వారిని ఒప్పించగలగాలని, లేదంటే నాయకత్వాన్ని మార్చాలని, అంతే తప్ప పార్టీని సొంత ఆస్తిలా శాసించే అధికారం ఎవరికీ లేదన్నారు. పార్టీలో మెజారిటీ నిర్ణయంతో సంబంధం లేకుండా విప్ జారీ చేయటం నిరంకుశత్వమవుతుందని, అప్రజాస్వామిక ధోరణుల వల్లే పార్టీ ఫిరాయింపుల వ్యతిరేక చట్టం విఫలమైందని తెలిపారు.

బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీ బోరిస్ జాన్సన్ వల్ల గెలిచినా, ఆయన పట్ల పార్టీ ఎంపీలు వ్యతిరేకత వ్యక్తం చేయగానే రెండేళ్లలోనే రాజీనామా చేశారని, ఆ తర్వాత లిజ్‌ట్రస్ అదేరీతిలో రెండు నెలల్లోనే రాజీనామా చేశారని, పార్టీలు ఆ రీతిలో ప్రజాస్వామ్యయుతంగా పనిచేయాలన్నారు. బీజేపీలో ఎన్నో లోపాలున్నా, నరేంద్రమోదీ దిగువ స్థాయి నుంచి సొంత సామర్థ్యంతో ఎదిగిన నాయకుడని, ఆ పార్టీకోసం లక్షలమంది స్వచ్ఛందంగా సమయం, వనరులు ఇస్తుంటారని అన్నారు. ఉద్ధవ్‌ఠాక్రే పట్ల లోక్‌సభ ఎన్నికల్లో కొంత సానుభూతి పనిచేసినట్లు కనిపిస్తుందని, కానీ ఇటీవల కుటుంబ రాజకీయాల పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు శాసనసభ ఎన్నికల ఫలితం నిదర్శనం కావచ్చని, అయితే ఈ విషయం ఇప్పుడే ధృవీకరించ లేమన్నారు.

కాస్త మెరుగ్గా పనిచేసిన, విశ్వసనీయత ఉన్న వారికి మనదేశం ఉన్న పరిస్థితుల్లో రెండోసారి అవకాశమిచ్చే సంయమనాన్ని ఓటర్లు ప్రదర్శిస్తున్నారని, జార్ఖండ్ ఎన్నికల ఫలితం ఉదాహరణగా కనిపిస్తోందని జేపీ అన్నారు. జార్ఖండ్‌లో కాంగ్రెస్ భాగస్వామ్యమున్న కూటమి గెలుపు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీల ఓటమి ఈవీఎంలపై కాంగ్రెస్ ఆరోపణలు అర్థరహితమని రుజువు చేస్తున్నాయన్నారు.

దేశ రాజకీయంలో ఒక మౌలిక ఏకాభిప్రాయం రావాలని, సంక్షేమ పథకాల పేరుతో ఆర్థికంగా దిగజారిస్తే పేదరికం నిరంతరం కొనసాగుతుంటుందని, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం ఉండేలా చూడాలని జేపీ స్పష్టం చేశారు. దేశానికి ఆర్థికంగా వచ్చే 20-25 ఏళ్లు గొప్ప అవకాశం ఉందని, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పెట్టుబడులు, మౌలిక వసతులతో ఆ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవటమే ఇప్పుడున్న ఏకైక ఆశాకిరణమన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసారి బాగా డబ్బు ఖర్చుపెట్టినట్టు చెబుతున్నారని, కేవలం ఎన్నికల్లో విజయం మీద కాకుండా రాజకీయాన్ని మార్చటం మీద సామర్థ్యం, నిజాయితీ సేవాభావం ఉన్న వాళ్లు ఎన్నికల్లో గెలవగలిగేలా సంస్కరణల్ని తేవడం మీద నరేంద్రమోదీ ప్రభుత్వం దృష్టి సారించాలని, దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే ఈ సంస్కరణల కోసం అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించాలని, లేకుంటే అదానీ స్కాం లాంటి ఆరోపణలు వరుసగా బయటపడి అస్థిరతను పెంచుతాయని జేపీ హెచ్చరించారు.

# అమెరికా గందరగోళం -ప్రపంచంపై పర్యవసానాలు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

ఈ వేళ్టి ఘటనలు, వ్యక్తులను మనం తరచూ హ్రస్వదృష్టితో చూస్తుంటాం. మనుషుల్ని, పరిణామాల్ని అంచనా వేయటంలో మన దూరదృష్టిలేమి తరచూ బయటపడుతుంటుంది. చరిత్రలో అత్యంత గొప్ప నాయకులు, క్రీడాకారులు లేదా నటుల పేర్లు చెప్పండని అడిగితే, ప్రస్తుత తరంలోని వారి గురించి ఆలోచిస్తాం, గతాన్ని మర్చిపోతాం. ఈ సామాజిక విస్మరణ శాపం బారి నుంచి శాస్త్రవేత్తలు, రచయితలు మాత్రం తప్పించుకున్నట్లు కనిపిస్తుంది. వారి కృషి ఇప్పటికే అజరామరమై ఉండటమో, లేకుంటే, ఇప్పటికే మనం అనుభవిస్తున్న ఫలాలు భవిష్యత్తులో మరింత ప్రగతికి స్పష్టమైన పునాది వేసి ఉండటమో అందుకు కారణం. ఓ ఉదంతం చెలామణిలో ఉంది. ఫ్రెంచ్ విప్లవం గురించి మీరేమనుకుంటున్నారు అని మావో జెడాంగ్‌ని హెన్రీ కిసింజర్ అడిగారట. "ఇప్పుడే చెప్పలేం" అని మావో సమాధానమిచ్చారు. సమకాలీన పరిణామాల వాస్తవ, దీర్ఘకాల ప్రభావాన్ని అంచనా వేయటం కష్టం.

డొనాల్డ్ ట్రంప్ ఢంకా బజాయించి రెండోసారి గెలవటం, గతం జాడలే కనిపించకుండా సరికొత్త పోకడల్ని ప్రవేశపెట్టాలని దృఢంగా ప్రయత్నిస్తున్న తీరు ఓ పెనుమార్పుకి దారితీయొచ్చు లేదా కాలగమనంలో ఇదీ ఓ దశగా మిగిలిపోవచ్చు.

ట్రంప్ విజయం అనేక రకాలుగా విభ్రాంతి కలిగిస్తుంది. 78 ఏళ్ల వయసులో అమెరికాకు అధ్యక్షుడిగా ఎన్నికైన అతి పెద్ద వయస్కుడాయన. మధ్యలో ఒకసారి ఓడి రెండుసార్లు గెలిచిన అధ్యక్షుడ్ని తానేనని ఆయన మళ్లీ మళ్లీ మనకు గుర్తుచేస్తుంటారు. 1884, 1892లో గ్రోవర్ క్లీవ్‌లాండ్ మాత్రమే అలా మధ్యలో బ్రేక్‌తో రెండుసార్లు ఎన్నికయ్యారు. ప్రతినిధుల సభలో అభిశంసన తర్వాత మళ్లీ ఎన్నికైన అధ్యక్షుడు ట్రంప్ మాత్రమే. 1988 నుంచి 36 ఏళ్లలో దేశం మొత్తంలో ఓట్లలో మెజారిటీ సాధించిన రెండో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ ఒక్కరే; మరో అభ్యర్థి 2004లో జార్జి బుష్ జూనియర్. డొనాల్డ్ ట్రంప్‌ది కేవలం గెలుపు కాదు; ఆయన అమెరికా రాజకీయ ముఖచిత్రాన్ని పునరావిష్కరించారు. రిపబ్లికన్ పార్టీని సమూలంగా మార్చారు.

అమెరికా ప్రజలు తీర్పు ఇచ్చేశారు, మిగతా ప్రపంచంగా మనం చెప్పటానికి ఇందులో ఏమీ లేదు. అమెరికాలో ప్రభుత్వం ఎన్నిక ప్రపంచమంతటా ప్రభావాన్ని



చూపుతుంది. కాని ప్రపంచానికి అక్కడి ఎన్నికలలో పాత్ర లేదు. అయితే అమెరికాకు జలుబు చేస్తే ప్రపంచం తుమ్ముతుంది. అమెరికా ప్రపంచంలోనే అత్యంత సంపన్న ఆర్థిక వ్యవస్థ. ప్రపంచ ఆదాయంలో నాలుగోవంతు ఆ దేశానిదే. అమెరికా సైనిక బలం నిరుపమానమైనది, ఆవిష్కరణలు అసమానమైనవి. ప్రపంచ సంస్కృతి, ఆలోచనా తీరు, వ్యవస్థలపై గత శతాబ్దానికిపైగా అమెరికా ప్రభావం ఎంతో ప్రగాఢమైనది. కాబట్టి అమెరికా రాజకీయాల్లో ఏ సమూల మార్పు జరిగినా ప్రపంచం మొత్తం ప్రభావాలుంటాయి. వాటికి మనం సిద్ధపడాలి.

ట్రంప్ ప్రభావం నిరపాయకరం కావచ్చు లేదా పెద్ద విధ్వంసకరం కావచ్చు, తాత్కాలికం లేదా శాశ్వతం కావచ్చు. ప్రచార సమయంలోని నిర్లక్ష్యపూరిత మాటలు, వాగాడంబరం, దూషణలు, అప్రశుతుల స్థానంలో పాలనాపరమైన సమన్వయాన్ని, సంయమనాన్ని ప్రదర్శిస్తారా, లేకుంటే అవి విపరీత విధానాలు, దుందుడుకు చర్యలుగా మారతాయా అన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఇప్పుడే చెప్పలేం. కేబినెట్ ఎంపికలో కొందరిని సాంప్రదాయానుగుణంగా ఎంచుకున్నారు. మరికొందరిని రాడికల్ భావాలున్న వారిని ఎంచుకున్నారు. వీరిలో ఏ వర్గానిది పై చేయి అవుతుందో అప్పుడే చెప్పలేం.

ట్రంప్ అధ్యక్ష హయాం ప్రపంచం మీద సానుకూల, అదేసమయంలో విధ్వంసకర ప్రభావం కూడా చూపే అవకాశముంది. బలమైన సానుకూల ప్రభావాన్ని మొదట చూద్దాం. పరిమిత ప్రభుత్వం, వృధాని అరికట్టటం,

*అమెరికాలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్న ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం, పౌరసత్వం స్వేచ్ఛను పెంపొందించటంలో ముఖ్య ప్రభావశీల శక్తులుగా నిలుస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థల్ని, ప్రక్రియల్ని నిల బెట్టటంలో అమెరికా విఫలమైతే, నాగరిక, హేతుబద్ధ చర్చ, మధ్యేమార్గ అంగీకార సంస్కృతి అందుకు మూల్యాన్ని చెల్లిస్తే, ప్రజాస్వామ్యం బలహీన పడుతుంది. ఏకపక్ష, నిరంకుశ ధోరణులు అధికారికమవుతాయి.*




అనవసర నియంత్రణల్ని తొలగించటానికి ఆయన ఇచ్చే ప్రాధాన్యత ఇతర దేశాలపై గణనీయ ప్రభావాన్ని చూపవచ్చు. భారత్‌నే చూడండి. ఇప్పటికీ ప్రభుత్వం పాత్రను ఇంకా పెంచటం, మార్కెట్ పోటీని, వినియోగదారునికి ఎంపిక స్వేచ్ఛను అణగదొక్కటం, వృధాను, అవినీతిని ప్రోత్సహించటం మన దేశంలో మామూలు వ్యవహారం. మిగతా ప్రపంచంతో పోల్చి చూసుకుంటే ఇప్పటికీ అల్పాదాయ దేశంగా ఉన్నా, మన ప్రభుత్వ వ్యయం జీడీపీలో 27% దాకా ఉంది. కానీ విచారకర విషయం, అందులో చాలా అదుపు లేకుండా పెరిగిన అధికార యంత్రాంగానికి, అధ్వాన్న పౌర సేవలు, విశృంఖల అవినీతికి వృధా అవుతోంది. మన ప్రభుత్వం తన మౌలిక బాధ్యతల నిర్వహణలో విఫలమవుతోంది. కానీ అనవసర నియంత్రణతో ఆవిష్కరణలకు, పెట్టుబడి, పోటీకి అవరోధమవుతోంది. ప్రభుత్వానికి కొత్త ఆలోచనాతీరు, పునర్నిర్వచనం, పునర్నిర్మాణం, వికేంద్రీకరణకు చర్యలతో మనం ఈ దుస్థితిని మార్చగలం.

ఆరోగ్యశాఖ మంత్రిగా ట్రంప్ ఎంపిక చేసిన మహాశయుడు వ్యాక్సిన్ల పట్ల తన అశాస్త్రీయ, అహేతుక తిరస్కార ధోరణుల్ని సవరించుకుంటే, జంక్ ఆహార పదార్థాలు, కల్తీ, ఊబకాయం, డయాబెటిస్‌పై దృష్టి సారిస్తే, ప్రపంచానికి మేలు జరుగుతుంది. భారతదేశం ప్రపంచ మధుమేహ రాజధానిగా తయారవుతోంది. జంక్ ఫుడ్స్, ఆహారంలో పురుగుమందుల అవశేషాలు, ఔషధాల్లో, పశు సంరక్షణలో యాంటీ బయోటిక్స్‌ను మితిమీరి వాడటం, అధిక మద్యపానం, పోషకాహార అసమతుల్యత మన ఆరోగ్యానికి అపార నష్టం చేస్తున్నాయి.

యుద్ధాలకు ముగింపు పలికి, శాంతిని పెంపొందించి, ప్రగతిని ప్రోత్సహించటం పట్ల అమెరికా సంకల్పం గనక దీర్ఘకాలికమైనదైతే, అది నిష్పాక్షికత, దేశ సార్వభౌమాధికారం, మానవ హక్కుల ప్రాతిపదికన జరిగితే అప్పుడు ప్రపంచం లాభపడవచ్చు. మన సమాజాల్లో ఇప్పటికే సవాలక్ష సమస్యలున్నాయి. యుద్ధాలు, ఉత్పత్తి-సరఫరా గొలుసుల విచ్ఛిన్నతతో కొత్త తలనొప్పులు అక్కర్లేదు.

కానీ ట్రంప్ విధానాల వల్ల అంతర్జాతీయంగా భయోత్పాత పరిణామాలకు ఆస్కారం ఉందన్నది వాస్తవం. అదీ తక్షణ ప్రభావం చూపేవి కావచ్చు. అధిక సుంకాలు విధించటం, భారీగా వలసదారుల బహిష్కరణ కారణంగా కార్మిక మార్కెట్ విచ్ఛిన్నమై అమెరికాలో అధిక ద్రవ్యోల్బణానికి దారి తీస్తుంది. ఇది వడ్డీ రేట్లను పెంచి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. దేశాల మధ్య వాణిజ్యం దెబ్బతింటుంది. పర్యవసానంగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ ఉత్పత్తిలో 7% కోల్పోవచ్చని కొన్ని అంచనాలు చెబుతున్నాయి. ఇంధన పరివర్తనపై బహుశా దీర్ఘకాల, నష్టదాయక ప్రభావం ఉండవచ్చు. భూతాపం, కర్బన ఉద్గారాల పట్ల మన తీవ్ర ఆందోళన, పునరుత్పాదక ఇంధనాల్లో సాంకేతిక ఆవిష్కరణలు ఇంధన రంగంలో భారీ మార్పుకి నాంది పలికాయి. కర్బనీకరణ విముక్తికి సారథ్యం వహించటానికి బదులు, అందుకు వ్యతిరేక విప్లవానికి అమెరికా నాయకత్వం వహిస్తే అది పెను విఘాతమవుతుంది. ఇక చివరిగా, అమెరికాలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్న ప్రజాస్వామ్యం, జవాబుదారీతనం, పౌరసత్వం స్వేచ్ఛను పెంపొందించటంలో ముఖ్య ప్రభావశీల శక్తులుగా నిలుస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థల్ని, ప్రక్రియల్ని నిలబెట్టటంలో అమెరికా విఫలమైతే, నాగరిక, హేతుబద్ధ చర్చ, మధ్యేమార్గ అంగీకార సంస్కృతి అందుకు మూల్యాన్ని చెల్లిస్తే, ప్రజాస్వామ్యం బలహీన పడుతుంది. ఏకపక్ష, నిరంకుశ ధోరణులు అధికారికమవుతాయి.

పర్షియన్ సామెత చెప్పినట్లు, ఇదీ శాశ్వతం కాదు. అమెరికాలోని రాజకీయ అపశ్రుతులు, కాలంచెల్లిన ధోరణులు నిర్లక్ష్యపూరిత విధ్వంసాలకు కాకుండా, వినూత్న ఆలోచనలకు, సృజనాత్మక మార్పులకి దారితీస్తాయని ఆశిద్దాం. ✦

# 2024 తీర్పుని శాసించిన ఆర్థికాంశాలు

ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైన సంవత్సరంగా 2024 ప్రారంభమైంది. భారత్ సహా చెప్పుకోదగిన నాలుగైదు డజన్ల దేశాలలో ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో గెలుపోటములపై ముఖ్యంగా మనవంటి దేశంలో ఉత్కంఠ సంగతి అటుంచితే, రహస్య బ్యాలెట్ ద్వారా ప్రజలు తమ ప్రతినిధిని ఎన్నుకోవటం, శాంతి యుతంగా అధికార మార్పిడి జరగటం ప్రజాస్వామ్యానికి ప్రాణ వాయు సమానం. ప్రజాభిప్రాయాన్ని కృత్రిమంగా తయారు చేసే ధోరణులు సోషల్ మీడియా ప్రభావం వల్ల అన్ని దేశాల్లో పెచ్చ రిల్లినా మొత్తంగా ప్రజలు తమ ఇంగిత జ్ఞానం, అవగాహన నుంచి ఓటు వేసే ప్రయత్నం ఎక్కువగా చేసినట్లు కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో, చాలా దేశాల్లో ప్రజల తీర్పు సాంప్రదాయ విశ్లేషణలకు అందని రీతిలో వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ప్రభుత్వాలు మార గా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వాల్ని ఎక్కువగా గెలిపించినా, నాయకుల అతి ధోర ణులకు కళ్లెం వేసే ప్రయత్నం ప్రజలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం భారత్, ప్రజాస్వామ్యానికి మాతృక లాంటి అమెరికా ఎన్నికల తీరునే ఒకింత పరిశీలిద్దాం.




అభివృద్ధికి సంబంధించి ఒక కీలక దశలో భారతదేశం ఉంది. గతం నుంచి పాఠాలు నేర్చుకొని, కనీసం కొన్ని మౌలిక తప్పులు చేయకుండా ఉంటే, మన దేశం జీవనప్రమాణాల్లో సంపన్న దేశాల స్థాయిని అందుకోగలుగుతుంది. ఆర్థికాభివృద్ధి రంగంలో తప్పులు అంటే, అప్పులు చేసిన డబ్బును కూడా పెట్టుబడులకు కాకుండా తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలకు ఖర్చు చేయటం, ఈ వేళ ఒక్క రూపాయి కూడా జమ చేయకుండా భవిష్యత్తు తరాల మీద అన్యాయమైన, అలవిమాలిన భారం మోపే పాతన పెన్షన్ విధానం(ఓపీఎస్) పునరుద్ధరణ, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ని చట్టబద్ధం చేయటం వంటివి. ప్రజలు ఇప్పటికీ ఇటువంటి ప్రలోభాల ప్రభావానికి లోనవుతున్నా వాటి తాత్కాలికతను, పరిమితిని ఈ ఎన్నికల్లో గుర్తించారు. అందుకే ఎంత ఖరీదైన తాత్కాలిక పథ కాన్నయినా వన్‌టైమ్ వ్యవహారంగానే చూడటం ప్రారంభిం చారు. అభివృద్ధికి, సొంత ఆదాయాలనిచ్చే, ఆదాయాలను పెంచే అవకాశాలకు ప్రత్యామ్నాయం లేదన్న సంకేతాన్ని ఈ సార్వత్రిక ఎన్నికల్లో పలు రాష్ట్రాల ప్రజలు ఇచ్చారు. అంతకు ముందు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ప్రస్ఫు టంగా ఇచ్చిన ఈ సమ్మిళిత అభివృద్ధి సంకేతాన్ని లోక్‌సభ ఎన్ని కల్లో, ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర వంటి ఎన్నికల్లో కూడా భారతదేశం కొనసాగించడం ఓ పెద్ద సానుకూల పరిణామం.

ఇక అమెరికా అధ్యక్ష ఎన్నికలు ప్రతిసారి కంటే ఈసారి ఎక్కువగా ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. భారత్ సహా చాలా దేశాల్లో ఎక్కువ మంది ప్రజలు, కాస్త సమాజహితం కోరేవారు ఓడిపోవాలని కోరుకున్న డొనాల్డ్ ట్రంప్‌ను రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా రికార్డు విజయంతో అమెరికా ప్రజలు గెలిపించటం విభ్రాంతి కలిగిస్తుంది. వలసల సమాహారంగా, వైవిధ్య వినూత్న ఆలోచనల స్వేచ్ఛా ప్రపంచంగా విలసిల్లే అమెరికాలో ఏకరూప జాతి రాజ్య భావనను బలంగా ప్రవేశపెట్టి, కోట్లాది శ్వేతజాతి సామాన్య ప్రజల్లో నెలకొన్న ఆర్థిక అభద్రతకు పరిష్కారంగా చూపటంలో ట్రంప్ సఫలమయ్యారు. సాంస్కృతిక వైరుధ్యాలను, జాతిరాజ్య భావనను కలగలిపి అమెరికాను గొప్పగా రూపొందించుకుందామనే నినాదంతో ట్రంప్ రూపొందించిన ఎన్నికల మిశ్రమం ముందు, సమ్మిళిత అమెరికా, అమెరికా కల వంటి భావాలతో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలాహ్యారిస్ రూపొందించిన మిశ్రమం తేలిపోయింది. కార్యకారణ సంబంధాన్ని కాస్త లోతుగా ఆలోచిస్తే చిట్టచివరి పౌరునికి కూడా సాధికారత లభించే వరకూ ప్రజాస్వామ్యంలోని వైరుధ్యాలు ఇలా దిగ్భ్రాంతికర రూపంలో బయటపడుతూనే ఉంటాయి, వాటిని సరిదిద్దేందుకు మరింత మెరుగైన ప్రజాస్వామ్య ప్రయత్నాలు కొనసాగి స్తూనే ఉండాలనే అభిప్రాయం కలుగుతుంది.

**భారత్ గ్రహించాల్సిన అంశాలు**

భారత్, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, అర్జెంటీనా ఇలా 2024లో అనేక దేశాల్లో జరిగిన ఎన్నికల తీర్పుని ఎక్కువగా ప్రభావితం చేసిన అంశం ఆర్థికా భివృద్ధి–ఉపాధి అవకాశాలు–ఆదాయాల పెరుగుదల. వీటిల్లో అంతరాలు అభివృద్ధి చెందిన దేశాల్లో తీవ్రస్థాయిలో, తక్షణ పరిష్కారాలు చూపాలనే డిమాండ్ రీతిలో, ప్రభుత్వాల్ని మార్చే స్థాయిలో వ్యక్తం కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సమ్మిళిత అభివృద్ధి, నాణ్యమైన ఆదాయాలు ఒక ప్రస్ఫుటమైన ఆకాంక్ష రూపంలో వ్యక్తమయ్యాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో పార్టీల మధ్య విధానపరంగా పెద్ద తేడాలేని చోట కూడా ప్రజలకు మొహం మొత్తటం, ప్రతిపక్షపార్టీల ప్రచార చాతుర్యం వంటి కారణాల వల్ల ప్రభుత్వాలు మారటం కనిపిస్తుందిగానీ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సహేతుక సంక్షేమ కార్యక్రమాలతో అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్న అధికార పార్టీలకు మరో అవకాశం ఇచ్చే సంయమన ధోరణి ఎక్కువగా కనిపిం చింది. మొత్తం మీద డాక్టర్ జేపీ తరచూ చెబుతున్నట్లు, ఆర్థికా భివృద్ధి లేకుంటే ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలన వంటివి బలహీన భావాలుగా, బూటకపు మాటలుగా మిగిలి పోతాయనటానికి ఈ ఎన్నికల్లో కొన్ని స్పష్టమైన నిదర్శనాలు కనిపిస్తాయి. అమెరికా లాంటి దేశం కూడా చట్టబద్ధపాలనను పట్టించుకోకుండా డొనాల్డ్ ట్రంప్ లాంటి వ్యక్తిని ఎన్నుకుంది.

ఆర్థికాభివృద్ధి, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి దాదాపు అన్ని దేశాల్లో ఈ ఎన్నికల్లో డిమాండ్‌గా ఉన్నా, అభివృద్ధి చెందిన దేశాల్లో సమస్య ఒక స్థాయి దాటిన ఆర్థికాంశాల్లో సృజనాత్మక పరిష్కారాలకు సంబంధించినదికాగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కనీసస్థాయి సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి కావలసిన మౌలికాంశాల్లో కూడా ఘోర వైఫల్యం కారణంగా కనిపిస్తుంది.

ఉదాహరణకు అమెరికాలో ట్రంప్ లాంటి వాళ్లని ఎన్నుకోవటం వల్ల భవిష్యత్తులో చట్టబద్ధపాలనకు సంబంధించి కొన్ని సమస్యలు తలెత్తవచ్చు. కానీ ఆ దేశ ఆర్థికాభివృద్ధి అత్యున్నత స్థాయికి పెరగటంలో చట్టబద్ధపాలన ఎంతో కీలక పాత్ర పోషించింది. భారత ప్రజాస్వామ్యం నుంచి కొన్ని విషయాల్లో అమెరికా నేర్చుకోవాల్సి ఉండొచ్చుగానీ, సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి మనం అక్కడ నుంచి నేర్చుకోవలసినవి చాలా ఎక్కువ. అమెరికాలో రాబోయే కాలంలో ఏవైనా సమస్యలు రావచ్చేమోగానీ, చట్టబద్ధపాలన పటిష్ఠంగా ఉంది. కానీ మన దేశంలో పరిస్థితి ఏమిటి? ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో గొడవ అదే గదా! వైకాపా ప్రభుత్వ వేధింపులపై అదే పోలీసులతో కూటమి ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకోవాలని. అదేవిధంగా తెలంగాణలో కేసులు. జాతీయ స్థాయిలో ఈడీ దాడులు, అరెస్టులు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, చట్టం ఉన్నవాళ్ల చుట్టంలా వ్యవహరిస్తోంది. మనం ఆర్థికాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే చట్టబద్ధపాలనను కాగితం మీద నుంచి కనీస స్థాయి ఆచరణలోకి తెచ్చేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా నాణ్యమైన విద్యను ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి బిడ్డకూ అందుబాటులోకి తెచ్చేందుకు నూరుశాతం రాజీలేకుండా కృషి చేయాలి. నైపుణ్యాల్ని మార్కెట్ అవసరాలకనుగుణంగా పెంపొందించాలి. వైద్యరంగంలో అమెరికా నైపుణ్యాల్ని నేర్చుకోవాలిగానీ, వైద్యవిధానాన్ని మాత్రం బ్రిటన్ తరహాలో అమలు చేయాలి. వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్య, వైద్యం ప్రతి ఇంటికీ అందుబాటులోకి తెచ్చి, అధికారాన్ని, అభివృద్ధిని వికేంద్రీకరించి పెట్టుబడులను ప్రోత్సహిస్తూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పౌర సేవల్ని నాణ్యతతో అందించే ఏర్పాటు చేస్తే కనీస స్థాయి సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు భారత్‌కు సమకూరతాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా తయారయ్యే నాయకత్వం సామర్థ్యానికనుగుణంగా అన్ని స్థాయిల్లోకి వేగంగా ఎదిగే విధంగా పార్టీల్ని ప్రజాస్వామీకరిస్తే అభివృద్ధి సవాళ్లు ఎప్పటికప్పుడు తేలిగ్గా పరిష్కారమవుతుంటాయి.

**పాడ్‌కాస్ట్ ప్రచారం**

2024 అమెరికా ఎన్నికల్లో పాడ్‌కాస్ట్ ద్వారా ప్రచారంతో ట్రంప్, కమలా హ్యారిస్‌లు ఎక్కువమంది ఓటర్లకు, ముఖ్యంగా యువతకి చేరువయ్యారు. మన దగ్గర కూడా ఇటీవల పాడ్‌కాస్ట్ ప్రాచుర్యం పొందుతోంది. సాంకేతికత సాయంతో తేలిగ్గా ఎక్కువమందికి చేరువకావటం మంచిదే. కానీ అంత ప్రాచుర్యం గల పాడ్‌కాస్ట్ ద్వారా ప్రజల్లోకి వ్యాప్తి చేస్తున్న భావాలు అమెరికా భవిష్యత్తు, ప్రజాస్వామ్యం పట్ల ఎంత పరిణతి, నిర్మాణాత్మక భావాల్ని పెంచగలుగుతున్నాయన్న ప్రశ్న ఓటింగ్ సరళిని చూస్తే కలుగకమానదు. రాజకీయాలకు, అధికారానికే కాదు ప్రచారానికి కూడా సూత్రబద్ధత, లక్ష్యం అవసరమని భారత్, అమెరికా ఎన్నికలు మనకు ఈసారి స్పష్టంగా తెలియచేస్తున్నాయి.

ఇక కీలక పదవుల నియామకాల్లో నిర్లక్ష్యంతో కూడిన సాహసాన్ని ట్రంప్ చేసినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వోద్యోగుల సంఖ్యను తగ్గించటం, వ్యయం నియంత్రించటం వంటి అంశాలపై ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి సంయుక్త సారథులుగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) ను ఏర్పాటు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవ సంవత్సరాన్ని వారికి కాలపరిమితిగా నిర్దేశించారు. ప్రభుత్వం ఏటా ఖర్చు పెడుతున్న 6.5 ట్రిలియన్ డాలర్లలో దుబారా, అవినీతిని అరికట్టి సమర్థత ఆధారంగా మార్పులతో ఫెడరల్ సంస్థలను పునరుద్ధరించటం డోజ్ ప్రధానమైన పని. ట్రంప్ తన తొలి అధ్యక్ష హయాంలోనే ఈ రకమైన నియంత్రణ ప్రభుత్వోద్యోగ వ్యవస్థపై సాధించే ప్రయత్నం చేశారు. కానీ అంతర్గత ప్రతిఘటనకు భయపడి వెనక్కి తగ్గారు. వచ్చే ఎన్నికల్లో పోటీ బాదరబందీ లేదు కాబట్టి, ఈసారి అందుకు సంబంధించిన లక్ష్యాలన్నిటినీ పూర్తి చేస్తారంటున్నారు. అయితే ఒక పరిధి దాటి అది అసాధ్యమంటున్నవారూ ఉన్నారు. ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సంస్కరించాలంటే ఎంత ప్రతిఘటన వస్తుందో మన దేశంలోనే ఉదాహరణలున్నాయి. ఎన్.టి రామారావు, జయలలిత లాంటి బలమైన నాయకత్వాలకే కష్టమైంది. ప్రభుత్వోద్యోగుల పట్ల యువతలో మితిమీరిన మోజు పెంచుతున్న ప్రభుత్వాలు, పార్టీల తీరు, సర్కారీ కార్యాలయాల్లో అలసత్వం, మిగతా 97 శాతం మంది ప్రజల ప్రయోజనాల్ని, భవిష్యత్తు తరాల ఆర్థిక స్థితి గతుల్ని దెబ్బ తీసేలా, పనిచేసేవారిలో కేవలం 3% ఉన్న ప్రభుత్వో ద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరిం చటాన్ని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జేపీ గట్టిగా వ్యతిరేకించి ప్రత్యామ్నాయం చూపారు తప్ప అత్యధికులు మౌనం వహించారు. సంఘటిత శక్తి గల ఉద్యోగుల ఆగ్రహానికి ఎక్కడ గురవుతామోనన్నట్లు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు కూడా బలంగా గొంతు వినిపించలేదు. అయితే యూనియన్ ప్రభుత్వం ఓపీఎస్‌కి వ్యతిరేకంగా గట్టిగా నిలబడటం, కాంగ్రెస్ సీఎంలున్న రాష్ట్రాల్లో ఎన్నికల్లో హామీ ఇచ్చినా విజ్ఞతతో ఆ వినాశకర డిమాండ్‌ను పక్కన పెట్టటం, ఉద్యోగుల్లో కూడా కొందరు పరిస్థితిని అర్థంచేసుకోవటం వంటి కారణాల వల్ల, రిటైరైన తర్వాత పెన్షన్‌కి ఉద్యోగులు, ప్రభుత్వం భవిష్యత్ తరాల మీద భారం లేకుండా ఈవేళే కంట్రిబ్యూట్ చేసేలా, అదే సమయంలో ఉద్యోగులకు కనీస పెన్షన్ భరోసా లభించేలా యూపీఎస్ వంటి పరిష్కారం అమలయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా నగదు బదిలీలు, రుణ మాఫీలు వంటి వ్యక్తిగత తాత్కాలిక పథకాలను అమలు చేసినా గెలవ లేకపోవటం, సొంత సామర్థ్యాలు, వినూత్న, ప్రత్యామ్నాయ ఆలోచనలతో కన్నా ప్రత్యర్థుల బలహీనతల మీద గెలవటం, తక్షణ, దీర్ఘకాల ప్రయోజనాల మధ్య సమన్వయం కొంవడ టం, సెలబ్రిటీలు, సంపన్నులు ప్రజాసేవా భావం, చరిత్ర లేకున్నా పదవుల కోసం పోటీపడటం వంటి సవాళ్లను ఎదుర్కోవటంపై కూడా అమెరికా, మరికొన్ని ప్రధాన ప్రజాస్వామ్య దేశాలతోపాటు భారత్ ఈ ఏడాది ఎన్నికల నుంచి దృష్టి సారించటం అవసరం. ✦

# రూ.2,94,427 కోట్ల అంచనా వ్యయంతో ఏపీ బడ్జెట్



***2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,94,427.25 కోట్ల అంచనా వ్యయంతో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఆర్థిక పునరుజ్జీవనం, సంపద సృష్టే లక్ష్యంగా అభివృద్ధి చక్రాన్ని పునఃప్రారంభించేలా ఈ బడ్జెట్‌ను రూపొందించామని ఆర్థికమంత్రి తెలిపారు.***

## ముఖ్య కేటాయింపులు (రూ. కోట్లలో)..

☞ అమరావతి రాజధాని నిర్మాణానికి, భూములిచ్చిన రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలకు కలిపి 3,445

☞ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 5,445

☞ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల కింద ఆస్తులు సృష్టించేలా మూలధన వ్యయానికి 32,712

☞ పేదల ఇళ్లలో చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున సాయం కోసం ఉద్దేశించిన 'తల్లికి వందనం' పథకానికి 6,487 కేటాయించారు

☞ రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రకటించిన 'అన్నదాతా సుఖీభవ' పథకానికి 1000

☞ 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 సాయం హామీ అమలుకు 'మహిళానిధి' కింద 3,341

☞ ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ సంక్షేమ పథకాలకు, వారికి సంబంధించిన మౌలిక సౌకర్యాల కల్పనకు 69,437

☞ డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకానికి 1250

☞ పేదల గృహనిర్మాణం కోసం 4,012

☞ పట్టణాల్లో జీ ప్లస్ 3 తరహాలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు 1,089

☞ వ్యవసాయ, అనుబంధ రంగాలకు కలిపి 43,402. ఇందులో ఉచిత విద్యుత్తుకు 7,241, జలవనరుల శాఖకు 16,705

☞ రహదారుల పునర్నిర్మాణానికి 5,441. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 16,739. పల్లెల్లో జల్‌జీవన్ మిషన్ పనులకు ప్రాధాన్యం ఇచ్చారు

☞ ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి స్వయంఉపాధి పథకాల కింద రాయితీలు ఇచ్చేందుకు 1521

☞ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహక బకాయిలు చెల్లించేందుకు ఈ బడ్జెట్‌లో 2,270.79 నిధులు చూపారు. కొత్తగా పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలకు భూసేకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు మూలధన వ్యయం కింద నిధులు చూపారు

☞ ద్రవ్యలోటు 68,742, రెవెన్యూలోటు 34,743గా అంచనా వేశారు


# 2022-23లో 341 రోజులూ అప్పుల్లో ఏపీ




***2022-23 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఆంధ్రప్రదేశ్‌లో తలసరి అప్పు రూ.1,03,758గా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పేర్కొంది. 2018-19లో ఈ మొత్తం రూ.50,157 మాత్రమే. వైకాపా ప్రభుత్వం 2022-23లో 341 రోజులు అప్పుల పైనే ఆధారపడిందని తెలిపింది. రిజర్వుబ్యాంకు వద్ద రోజువారీ కనీస నిల్వ రూ.1.94 కోట్లు 24 రోజులే నిర్వహించగలిగింది. మిగిలిన రోజుల్లో వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం, ఓవర్ డ్రాఫ్ట్ కింద రుణాలు తీసుకుంది.***

**2022-23 ఆర్థిక సంవత్సరం ఏపీ చివరి ఆడిట్ నివేదికను కాగ్ వెలువరించింది. ముఖ్యాంశాలు:**

- అప్పులు అపరిమితమయ్యాయి. యూనియన్ ప్రభుత్వానికి కొన్ని రుణాల లెక్కలు చెప్పలేదు. పెండింగ్ బిల్లులను పరిగణలోకి తీసుకుంటే రుణభారం పెరిగిపోయింది. రెవెన్యూ వ్యయాన్ని మూలధన వ్యయంగా చూపారు. ప్రభుత్వ ఖర్చులను కార్పొరేషన్ ఖర్చుల్లో చూపారు. ఆర్థికంగా అంతా బాగుందని, చట్టానికి లోబడే ఆర్థిక నిర్వహణ చేస్తున్నామని చెప్పేందుకు ఇలా చేశారు. నిజానికి



వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

- రాజ్యాంగ విరుద్ధంగా కార్పొరేషన్ల ఏర్పాటు, సంచిత నిధిని వాటికి మళ్లించటం చేశారు. అప్పులు తెచ్చి ఆస్తులు సృష్టించలేదు.
- మొత్తంగా చూస్తే, ఆర్థిక సంక్షోభానికి రాష్ట్ర విభజన కారణంగా కనిపించదు. నిధుల లోటును కేంద్రం భర్తీ చేసింది. పెరిగిపోయిన, అదుపు తప్పిన ప్రభుత్వ ఖర్చులు, విధానాల వల్ల రాష్ట్రం ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయింది.
- నాటి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రుణాలను కలపకుండా మొత్తం అప్పును తేల్చింది. జీఎస్‌డీపీలో రుణాల వాటా తక్కువగా చూపి ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడే అప్పులు ఉన్నాయని పేర్కొంటూ వచ్చింది. బడ్జెట్‌లో చూపని రుణాల

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కార్పొరేషన్, బెవరేజెస్ కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి తీసుకున్న రుణాలు రాజ్యాంగ విరుద్ధమని కాగ్ స్పష్టం చేసింది. రాష్ట్రాభివృద్ధి సంస్థను స్థాపించి రూ.25 వేల కోట్ల రుణాలు సమీకరించేందుకు ప్రభుత్వం గ్యారంటీలు ఇచ్చింది. వాటిని ప్రభుత్వం తన ఆదాయాల నుంచి చెల్లించాలి. బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు జారీ చేసి సమీకరించిన రుణాలకూ రాష్ట్ర ప్రభుత్వమే హామీ ఇచ్చింది. ఈ రుణాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 293(3)కి విరుద్ధంగా ఉన్నాయి, రాష్ట్ర ప్రభుత్వ ఎఫ్ఆర్‌బీఎం పరిధిని దాటిపోయాయి.

2022-23 ఆర్థిక సంవత్సరంలో బెవరేజెస్ కార్పొరేషన్ రూ.12 వేల కోట్ల రుణాలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. యూనియన్ అనుమతితోనే రాష్ట్ర ప్రభుత్వం సంచిత నిధి హామీపై రుణం తీసుకోవచ్చు. ప్రభుత్వ అకౌంటింగ్ నిబంధనల ప్రకారం.. అలా అప్పుగా తీసుకున్న మొత్తాన్ని మూలధన ఆస్తుల కల్పనకి ఉపయోగించాలి. ఆ విధానం వాటన్నింటినీ ఉల్లంఘించింది. మద్యంపై రిటైల్ అదనపు ఎక్సయిజ్ సుంకం (ఏఆర్ఈటీ) విధించి, ఆ ఆదాయాలను రాష్ట్రాభివృద్ధి కార్పొరేషన్‌కు నిధిగా కేటాయించారు. ఈ కార్పొరేషన్ ద్వారా రుణాలు సేకరించేందుకు వీలుగా ఎస్క్రో ఖాతాలో ఆ నిధులు జమ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇదే విధానంలో రాష్ట్ర రహదారి అభివృద్ధి సంస్థ నుంచీ రుణాలు సమీకరించారు. ఈ పద్ధతుల కారణంగా కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ఖర్చులపై శాసనసభ అధికారిక నియంత్రణ కోల్పోతోంది.

**జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద వివిధ కార్యక్రమాల కోసం 2017-22 మధ్య రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు రూ.350.93 కోట్లు విడుదల చేయలేదు. నాబార్డ్, ప్రపంచబ్యాంకు అందించిన ఆర్థిక సహాయాన్ని ఉపయోగించుకోలేదు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగంపై 2020 నాటి కల్లా 8% కంటే ఎక్కువ వెచ్చించాలనేది లక్ష్యమైతే, 2022 మార్చి నాటికి 3.11 శాతమే వెచ్చించారు. అందులో ఇప్పటికీ 4.31 శాతం కంటే ఎక్కువ అంతరం ఉందని కాగ్ తెలిపింది.**

మొత్తాన్ని తక్కువ చేసి చూపింది. కేంద్రానికి తప్పుడు లెక్కలు చెప్పింది. ఆ రుణాలు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన మొత్తం కన్నా చాలా ఎక్కువ.

- 2022-23 ఆర్థిక సంవత్సరం చివరికి రాష్ట్రం మొత్తం రుణ బకాయిలు 32.17% ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలోపే ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన బడ్జెటేతర రుణాలనూ లెక్కేస్తే, మొత్తం రుణాలు జీఎస్‌డీపీలో 43.99%. ఇది ఎఫ్ఆర్‌బీఎం చట్ట పరిధిని దాటిపోయినట్లే. 2023 మార్చి చివరికి బడ్జెటేతర రుణాలు రూ.35,114 కోట్లే ఉన్నట్లు కేంద్రానికి రాష్ట్రం వర్తమానం ఇచ్చింది. ఇది తప్పు. అసలు లెక్కలు చూస్తే కేంద్రానికి చెప్పిన దానికంటే రూ.92,934 కోట్లు అదనం. కార్పొరేషన్ల రుణాలు తమ బాధ్యత కాదని ప్రభుత్వం చెప్పింది. అది సరికాదు.
- రెవెన్యూ లోటు 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022-23 చివరినాటికి 405.2% పెరిగింది. 2018-19 నుంచి గడచిన అయిదేళ్ల పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే ఇదే అత్యధికం.


**ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్న సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సీఎఫ్ఎంఎస్)లో లోపాలు గుర్తించామని, వాటిని సరిచేయాలని కాగ్ నివేదిక సిఫార్సు చేసింది. ఈ వ్యవస్థ రూపకల్పనలోనే కొన్ని లోపాలు ఉన్నాయని, ధ్రువీకరణ నియంత్రణలు సరిగా లేవని అభిప్రాయపడింది. 2018 ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. వ్యవస్థలో బిల్లుల నకిలీలను పరిశీలించే ఏర్పాటు లేకపోవటం వల్ల ప్రభుత్వ ఖజానా నుంచి అధిక చెల్లింపులు చేశారు. ఏపీ ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును సమీక్షించాలి. వాటి ఆర్థిక పనితీరు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.**




**రాబోయే ఏడేళ్లలో రాష్ట్రం రూ.1,39,567.14 కోట్ల రుణాలను తీర్చాలి. ఈ భారాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం అదనపు రెవెన్యూ వనరులను సమకూర్చుకోవటంతోపాటు వివేచనాత్మక రుణ వ్యూహాన్ని రూపొందించుకోవాలి. ఇందుకు నిర్దిష్ట ప్రణాళిక లేకపోతే అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు లేకుండా పోతాయని కాగ్ తెలిపింది.**

- గడచిన అయిదేళ్లలో 2022-23లోనే మూలధన వ్యయం తక్కువ. ఆస్తుల సృష్టికి 2018-19లో రూ.19,976 కోట్లు వెచ్చిస్తే.. 2022-23లో రూ.7,244 కోట్లే ఖర్చు చేశారు. రెవెన్యూ వ్యయం అధికమవుతూ, కనిష్ట స్థాయిలో మూలధనం వెచ్చించటం వల్ల సంపదసృష్టిపై దీర్ఘ కాలంలో ప్రభావం చూపుతుంది. ఒక రూపాయి రెవెన్యూ వ్యయం చేస్తే ఆర్థిక వ్యవస్థకు కేవలం రూ.0.96 మేర మద్దతు ఉంటుంది. అదే మూలధనమైతే రూ.4.8గా ప్రభావం చూపుతుంది.
- వైఎస్సార్ గృహ వసతి పథకం కింద ఇళ్ల స్థలాలకు చేసిన రూ.100.48 కోట్ల ఖర్చును మూలధన వ్యయంగా చూపారు. అది రెవెన్యూ వ్యయంగానే పరిగణించాలి.
- కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2022-23లో కేంద్రం కేటాయించిన రూ.905.69 కోట్లు, రాష్ట్ర వాటా రూ.835.67 కోట్లు కలిపి రూ.1,741 కోట్లు మురిగి పోయాయి. రాష్ట్ర ప్రాయోజిత పథకాలకు కేటాయించిన రూ.7,346.35 కోట్లూ మురిగిపోయాయి.

# రేవంత్ పాలన@1



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7కి ఏడాది పూర్తయింది. ఎంతో పోరాట పటిమను ప్రదర్శించి రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవటంలో కీలక పాత్ర పోషించటమే కాకుండా పెద్ద వ్యతిరేకత లేకుండా ముఖ్యమంత్రి కూడా కాగలిగారు. కేసీఆర్ పాలన పట్ల ప్రజల్లో ప్రత్యేకించి వ్యతిరేకత లేకపోయినా, అభివృద్ధి ఎక్కువగా హైదరాబాద్ మహానగరానికే పరిమితం కావటం, కేసీఆర్ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా రాచరిక ధోరణులతో చుట్టూ కంచె నిర్మించుకుని ప్రగతి భవన్‌కి పరిమితం కావటం, అనూహ్యంగానో, వ్యూహాత్మకంగానో బీజేపీ బలహీనపడటం వంటి కారణాలతో కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తీరు, ఓటమికి కేసీఆర్ డీలా పడిన తీరు, రేవంత్ దూకుడు చూశాక గణనీయ సంఖ్యలో ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ మూడోస్థానంలోకి వెళ్లిందనే అభిప్రాయం ప్రజల్లో కలిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ద్వితీయస్థానం కోసం కాంగ్రెస్, బీజేపీ పోటీపడగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రెండోస్థానం కోసం బీజేపీ, బీఆర్ఎస్ పోటీపడే పరిస్థితి ఏర్పడింది. అయితే కాంగ్రెస్ పార్టీ కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే సగానికి సగం ప్రజాదరణను కోల్పోయి బీజేపీ బాగా బలపడింది. బీఆర్ఎస్ ఒక్క లోక్‌సభ సీటూ గెలుచుకోలేకపోయింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కుమార్తె కవిత విడుదల కోసం బీజేపీతో కేసీఆర్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారని, బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి బదలాయించటం వల్లే ఆ పార్టీ సీట్లు గెలుచుకుందనే ఆరోపణలున్నప్పటికీ, బీఆర్ఎస్ మూడోస్థానంలోకి పడిపోయిందన్నది వాస్తవం.

టీఆర్ఎస్/బీఆర్ఎస్ హయాంలోనే తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలను కొంత శ్రుతి మించి ఇచ్చారని, పెట్టుబడుల పేరుతో కాళేశ్వరం వంటి అనుత్పాదక పథకాల్లో భారీ వ్యయం వల్ల రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు ఉన్న పరిస్థితి నుంచి భారీ అప్పుల్లోకి జారిపోయిందని ఎన్నికలకు ముందే తెలిసినా కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ కంటే రెట్టింపుకి పైగా, అంటే, ఏడాదికి సుమారు రూ. 1,30,000 కోట్ల మేర వ్యక్తిగత తాత్కాలిక పథకాలను ప్రకటించింది. ఎన్నికలైన వెంటనే అంత డబ్బు లేదని, అప్పుల వడ్డీల చెల్లింపే భారంగా ఉందని శ్వేతపత్రం ద్వారా ప్రకటించింది. ఈ సమయంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్ ప్రభుత్వానికి కీలక సూచన చేశారు. పథకాలను హేతుబద్ధీకరించి, ఎంత ఖర్చవుతుంది, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిరీత్యా దశలవారీగా ఎలా అమలు చేస్తాం అని ప్రజలకు వివరించి చెప్పాలని, ఇదంతా నిగ్గు తేల్చటానికి నిపుణుల కమిటీ వేయాలని తెలిపారు. ఈ క్రమంలోనే యూపీయే హయాంలో ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా వంటి వారితో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కీలక అధికారులు సమావేశమయ్యారు. కానీ వారు చెప్పింది వీరు ఏమి ఆలకించారోగానీ, వెంటనే మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రారంభించారు. కేసీఆర్ వ్యవహారశైలికి భిన్నంగా వ్యవహరించటమే ఒక పెద్ద కార్యక్రమంగా మార్చి, ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజల ఫిర్యాదులను తీసుకోవటం, మీడియాతో ముఖ్యమంత్రి దాదాపు రోజూ మాట్లాడటం, వార్తల్లో ఉండేలా చూసుకోవటం వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వటం ప్రారంభించారు. ఆరు గ్యారంటీల అమలుకు అవరోధాలు ఎదురవుతున్నా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆగస్టు 15 లోగా రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఆర్‌టీసీ బస్సుల్లో మహిళ ఉచిత ప్రయాణం వల్ల సమస్యలపై మహిళల నుంచే ఫిర్యాదులు వస్తున్నా లోపాల్ని సరిదిద్దే ప్రయత్నం చేయకుండా, ఏకకాలంలో రూ. 18,000 కోట్ల దాకా రుణమాఫీ చేయటంతో నిధులకు కటకట ఏర్పడింది. హైడ్రా, మూసీ సుందరదీకరణ వంటి మంచి పథకాలను కూడా సమర్థంగా అమలు చేయటం కంటే, ప్రచార

ఆర్భాటానికి, కమీషన్ల కోసమన్నట్లు భారీ ఖర్చు ప్రతిపాదన చేయటం, క్షేత్రస్థాయి సమస్యలను అధికారులకు వదిలేయటంతో ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. బీఆర్ఎస్ భవిష్యత్తు ప్రశ్నార్థకం అనుకుంటున్న తరుణంలో ఆ పార్టీకి మళ్లీ జవజీవాలద్దేలా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. దీనికి తోడు, అన్నిట్లో కేసీఆర్ శైలికి వ్యతరేకంగా వ్యవహరిస్తున్న రేవంత్, వ్యక్తిగత ప్రతీకార ధోరణుల్లో కేసీఆర్‌తో పోటీపడుతున్నారన్న అభిప్రాయం ప్రబలటం ప్రభుత్వం పట్ల అసంతృప్తిని పెంచుతోంది. బీఆర్ఎస్‌ను ఓడించటం ప్రజలు చేసిన తప్పు, తన పార్టీని ఓడించటం ద్వారా ఏం కోల్పోయారో ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోందని ఫాంహౌస్‌కి పరిమితమైన కేసీఆర్ ధోరణి వల్ల బీఆర్ఎస్ ఏ మేరకు పుంజుకుంటుందన్న అంశాన్ని అలా ఉంచితే, రేవంత్ ప్రభుత్వం గ్రాఫ్ మాత్రం పడిపోతున్న మాట వాస్తవం. ఏడాది పూర్తవుతున్న సందర్భంలోనైనా లోతైన సమీక్ష గావించుకోవటం అవసరం. పన్నుల వసూళ్లకు, వడ్డీలు, రోజువారీ ఖర్చులకు మధ్య సమతూకం ఉండటం లేదని, నిపుణుల సలహాలు తీసుకుని ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు అన్వేషించాలని ఇటీవల అధికారులకు ముఖ్యమంత్రి మళ్లీ సూచించినట్లు వార్తలు వచ్చాయి. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. తన ప్రమేయం లేకుండా హైకమాండ్ ధోరణి వల్ల ఇచ్చిన అలవిమాలిన హామీలను ఒక క్రమపద్ధతిలో నెరవేర్చేలా రోడ్‌మ్యాప్‌ను హేతుబద్ధంగా ప్రకటించి ఒప్పించే ప్రయత్నం ముఖ్యమంత్రి చేయాలి. కర్ణాటకలో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది కాబట్టి, హైకమాండ్ సంయమనం పాటించే అవకాశం ఉంది. ఆర్థిక క్రమశిక్షణ, రాష్ట్రంలో పెట్టుబడుల ప్రోత్సాహానికి ఇప్పుడు చేస్తున్న కృషిని కొనసాగిస్తూ హైదరాబాద్‌తోపాటు ఎక్కడికక్కడ చిన్న పట్టణాలను అభివృద్ధి చేస్తూనే, అదనపు ఖర్చు లేని రంగాల్లో వేగంగా సంస్కరణలు తీసుకురావాలి.

ఉదాహరణకు విద్యారంగం. ఇందులో ఒక్క రూపాయి అదనంగా ఖర్చు చేయకుండానే అద్భుత ఫలితాల్ని రాష్ట్రం సాధించవచ్చు. ఆరోగ్య రంగంలో కొద్దిపాటి అదనపు ఖర్చుతో విప్లవాత్మక మార్పు తెచ్చే అవకాశం ఉంది. అదే విధంగా గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేస్తే, న్యాయం చౌకగా, అందరికీ వేగంగా, సమర్థంగా అందించవచ్చు. స్థానిక కోర్టులతో మహిళల భద్రత తేలిగ్గా సాధ్యమవుతుంది. ఈ ఖర్చు లేని పెద్ద మార్పుల్ని వదిలేసి కార్యాచరణలేని హెడ్‌లైన్స్‌కి, అపరిపక్వ ప్రకటనలకు, వ్యక్తిగత కక్షసాధింపు ధోరణులకు పరిమితం కావటంతో ప్రభుత్వ యంత్రాంగం మీద రేవంత్‌కి పట్టు లభించలేదు, ప్రజల్లోనూ ఆదరణ సన్నగిల్లుతోంది.

**అదనపు ఖర్చు లేని రంగాల్లో వేగంగా సంస్కరణలు తీసుకురావాలి. ఉదాహరణకు విద్యారంగం. ఇందులో ఒక్క రూపాయి అదనంగా ఖర్చు చేయకుండానే అద్భుత ఫలితాల్ని రాష్ట్రం సాధించవచ్చు. ఆరోగ్య రంగంలో కొద్దిపాటి అదనపు ఖర్చుతో విప్లవాత్మక మార్పు తెచ్చే అవకాశం ఉంది.**

రేవంత్ ప్రభుత్వం ఏడాది పాలనలోని లోపానికి అదనపు డబ్బు ఖర్చు ప్రమేయంలేని విద్యాశాఖ గురించే కొంచెం వివరంగా చూద్దాం. బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'విద్యాభివృద్ధి జరగాలని విద్యాశాఖను నేనే నిర్వహిస్తున్నాను. బడ్జెట్‌లో రూ.21 వేలు కేటాయించాం. అది బడ్జెట్‌లో 7 శాతానికి పైగా ఉంది. గత పదేళ్లలో ఒక్క డీఎస్సీ మాత్రమే నిర్వహించారు. మేం తొమ్మిది నెలల్లోనే 11,062 కొత్త టీచర్లను నియమించాం. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించాం. పాఠశాలలకు పారిశుద్ధ్య కార్మికులను నియమించాం. రూ.650 కోట్లతో బల్లలు, బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. యూనివర్సిటీల్లో త్వరలో బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేసేందుకు ముందుకెళ్తున్నాం' అని తెలిపారు. రూ.5 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఎయిర్‌కండిషన్ సదుపాయంతో వచ్చే ఏడాదిలోపు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

అదేవిధంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా, 'తొలి సంవత్సరం విద్యారంగ అభివృద్ధి – ప్రభుత్వ ప్రాధాన్యత' పేరిట ముఖ్యమంత్రి ఒక నివేదికను విడుదల చేశారు. అందులో గత 11 నెలల కాలంలో విద్యారంగంలో విజయాలను పొందుపరిచారు. ముఖ్యాంశాలు ఏమిటంటే, సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా పారిశుద్ధ్య కార్మికుల నియామకం, పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా, విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టుధర రూ.50 నుంచి రూ.75కి పెంపు, దాదాపు దశాబ్దం తర్వాత 21,419 మంది టీచర్లకు పదోన్నతుల కల్పన, ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్న 34,706 మంది బదిలీ, మోడల్ స్కూళ్లలో 2013 నుంచి బదిలీల కోసం ఎదురుచూస్తున్న 2,757 మందికి స్థాన చలనం, 8,630

మంది భాషా పండితులు, 1849 మంది పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు, నైపుణ్య వర్సిటీ ఏర్పాటు, కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను ఇంజినీరింగ్ కళాశాలగా స్థాయి పెంపు.. మొదలైనవి. ఇవన్నీ అవసరమే. కానీ వీటన్నిటి సారాంశమైన నాణ్యమైన విద్య గురించి, విద్యా ప్రమాణాలు పెంచటానికి, మరోతరం జన్యుసంపద వృధా కాకుండా చర్యల గురించి ప్రస్తావన లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అణగారిన, పేద వర్గాల పిల్లలే ఎక్కువగా చదువు కుంటున్నారని, కొన్ని గురుకులాలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించటానికి ప్రత్యామ్నాయం కాదనే ఆలోచన ప్రభుత్వంలో కొరవడింది.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యాకమిషన్ త్వరలో నివేదిక ఇస్తుందంటున్నారు. ఇప్పటికే మన జాతీయ నూతన విద్యావిధానం ఉంది, 'పీసా' వంటి సర్వేల ప్రమాణాలున్నాయి, జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వే గణాంకాలున్నాయి, కాబట్టి విద్యాకమిషన్ నివేదిక ఏదైనా కూడా ప్రతి బిడ్డకూ ప్రకృతి ఇచ్చిన ప్రతిభ వికసించేలా, ప్రభుత్వోద్యోగాల కోసం కాలం వృధా చేసుకోకుండా మార్కెట్‌లో ఉపాధి సంపాదించుకోగలిగేలా, విద్యార్థి కేంద్రంగా విద్యావ్యవస్థను నిర్మించేలా ఉండాలి. ఇందుకు అదనపు డబ్బు కూడా అవసరం లేదు. ఉన్న డబ్బును సద్వినియోగం చేస్తే చాలు. అదేవిధంగా, ఆరోగ్యరంగంలో ఇష్టారాజ్యం బదిలీలు, జీతాలతో డాక్టర్ల నియామకం, పైనుంచి ఆదేశాలు వంటి విఫల పద్ధతులకు స్వస్తి చెప్పి, చిన్న పట్టణాలు కేంద్రంగా క్వాలిఫైడ్ డాక్టర్లతో సేవల మధ్య పోటీ, ప్రజలకు నమ్మకమున్న డాక్టర్‌ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛతో సమర్థవంతమైన ఫ్యామిలీ డాక్టర్లు, ల్యాబొరేటరీలు, మందుల వ్యవస్థను ఒకేచోట అందుబాటులోకి తేవాలి.

ప్రపంచవ్యాప్తంగా అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలో కూడా ప్రజలు తాత్కాలిక ఉపశమనాన్ని కోరు కుంటున్నారు. కానీ కోవిడ్ సమయంలో అదనపు డాలర్లను ముద్రించి మరీ ప్రజలకు నగదు బదిలీ చేసినా డెమోక్రాటిక్ పార్టీని ఓడించారు. తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ పార్టీకి స్వయంగా ఈ అనుభవం ఉంది. అసలు తాత్కాలిక ఉపశమనాలు లేకున్నా ప్రజలు ఓడిస్తారు కాబట్టి, తాత్కాలిక వ్యక్తిగత పథకాలకు, అభివృద్ధికి మధ్య సమతూకం ఉండేలా ఆర్థిక క్రమశిక్షణను పాటించటం, విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక సాధికారత మొదలైన రంగాలలో పెద్ద ఖర్చులేని మౌలిక సంస్కరణల్ని ఆలస్యం లేకుండా తీసుకురావటం రేవంత్ ప్రభుత్వం ప్రజాదరణ పొందటానికి ఆచరణసాధ్య మార్గం. ఎక్కడికో పోనక్కర్లేదు. ఎటువంటి ఆర్భాటం లేకుండా పనిచేసిన గొప్ప ముఖ్యమంత్రులను అందించిన చరిత్ర తెలుగునాటే కాంగ్రెస్ పార్టీకి ఉంది. వారి నుంచి నేర్చుకున్నా రేవంత్ కీలక సమయంలో తెలంగాణకు ఒక గొప్ప ముఖ్యమంత్రిగా నిలిచిపోగలుగుతారు. ✦

## వైద్య సేవలపై వాస్తవాలు తెలియజేస్తాం




జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు స్థానిక ఘోషా ఆసుపత్రిలో రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందడం లేదని ఆరోపణలను వినిపిస్తున్నాయి. వాస్తవాలు తెలుసుకుని ప్రజలకు, పాలకులకు తెలియజేసేందుకు జిల్లా పౌరవేదిక ప్రత్యేక బృందంతో కలిసి ఆస్పత్రుల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో తెలిపారు. జిల్లాకి ప్రభుత్వ వైద్యకళాశాల మంజూ రైనప్పటికీ ప్రజలకు సంతృప్తికర స్థాయిలో వైద్యం అందక పోవడంతో అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ప్రజలకు వైద్యం అందించేందుకు రాజీపడకుండా నిధులు మంజూరు చేస్తున్నట్టు చెబుతుందన్నారు. లోపం ఎక్కడుందో అర్థం కావడం లేదన్నారు. జీజీహెచ్‌కి వచ్చే రోగులను విశా ఖపట్నం కేజీహెచ్, ఇతర ఆస్పత్రులకు రిఫెర్‌చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు లేవని రోగులు గగ్గోలుపెడుతున్నారని తరచూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. వీటన్నిటిపై తమ బృందం పూర్తి స్థాయి నివేదికను తయారు చేసి అధికారులు, జిల్లా మంత్రి, ప్రజా ప్రతినిధులకు అందిస్తుందన్నారు. సమావేశంలో పౌర వేదిక ప్రతినిధులు రౌంగలి పోతన్న, జలంత్రి రామ చంద్రరాజు, తుమ్మగంటి రామ్మోహన్, మాతృభూమి సేవా సంఘం నేత ఇప్పలవలస గోపాలరావు, గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు కనకాచారి, అభిషేక్, పట్నాయక్ రాజారావు, అప్పారావు, పీఎల్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Vote Jugaad December 2024!

## Cooperation based on trust - Jugaad Voters' Government!

## (నమ్మకం పై ఆధారపడిన పరస్పర సహకారం)

**(ప్రతిపాదిత జుగాడ్ ద్విపక్ష పార్టీ మూడవ రాజ్యాంగ దినోత్సవ (26-11-2024) శుభాకాంక్షలు)**

పొద్దున లేచి ఏ వార్తాపత్రికచూసినా హృదయాన్ని కలచివేసే ఏదో ఒక వార్త కనిపిస్తుంది..

Apathy, negligence & worms on the menu at Maganoor ZPHS...(TNIE 29-11-2024Hyderabad

1.మన ఓట్లతో ఎన్నికైన ఎమ్మెల్యేలు కండువాలు మార్చుకుంటూ ఐదేళ్లు నెట్టుకొస్తారు. కానీ ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం, (అనగా- జిల్లా కలెక్టర్ దగ్గర నుండి హైకోర్టు జడ్జి గారి బిళ్ళ బంట్రోతు వరకు), అపరిమిత భద్రతతో జవాబు దారీతనం లేకుండా 35 ఏళ్లు జీవితం గడుపుతున్నారు. అందుచేత వారు "పని చేసిన కాలానికి" తగిన జీతం అనే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు నియమ నిబంధనలు ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులకీ ఇతర ఉద్యోగులకీ మధ్య వివక్ష ఉన్నంతవరకూ సామాజిక న్యాయం జరగదు.

2. మన దేశం శీఘ్ర గతిని అభివృద్ధి చెందాలంటే జాతీయ స్థూల ఉత్పత్తి పెరగాలి. అలాగే పారిశ్రామిక రంగంలోనూ వ్యవసాయ రంగంలోనూ సేవారంగంలోనూ ఉత్పత్తులు పెరగాలి. ఉత్పత్తులు మూడు రకాలు. 1) జనాభా ఉత్పత్తి 2) వ్యవసాయ ఉత్పత్తి. 3) పారిశ్రామిక ఉత్పత్తి. భారతదేశ జనాభా 150 కోట్లకు మించకుండా ఉన్నప్పుడే పురోగతి! లేనిపక్షంలో తిరోగతి!

3. ప్రపంచంలోనే అతిపెద్ద ధనిక దేశంగా మారాలంటే మన యొక్క బంగారం నిల్వలను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. బంగారాన్ని కళ్యాణ లక్ష్మి పేరుతోనో షాదీ ముబారక్ పేరుతోనో ఉచితంగా పంచిపెట్టే ప్రభుత్వ విధానాలకు తెర దించాలి. శాస్త్రీయంగా దారిద్ర్యం అనే పదానికి సశాస్త్రీయంగా నిర్వచనం ఇచ్చి శాశ్వతంగా దారిద్ర్యాన్ని రూపుమాపడమే ధ్యేయంగా ద్విపక్ష - జుగాడ్ పార్టీ ఆవిర్భవిస్తుంది.

4. మనదేశంలో భావ దారిద్ర్యానికి మించిన దారిద్ర్యం మరొకటి లేదు. అంతవరకు మూడు లక్షల రూపాయల వరకు వార్షి కాదాయం ఉన్న ఓటర్లను అందర్నీ పేదవారిగా గుర్తించి వారికి పరిపాలనలో భాగస్వామ్యం కల్పిస్తుంది ద్విపక్ష జుగాడ్ పార్టీ.

5. జుగాడ్ 50:50 రాజనీతిని సమర్థించే కనీసం రెండు టీవీ చానల్స్ మరియు రెండు ప్రముఖ వార్తాపత్రికలు మాచేత ప్రతిపాదించబడిన జుగాడ్ ఓటర్ల ద్విపక్ష పార్టీకి పదివేల రూపాయల భాగస్వామ్య విరాళంతో ఈ పార్టీకి అధికృత ప్రతినిధులుగా వ్యవహరించవచ్చు. ఇప్పటిదాకా వివిధ రకాలుగా వివిధ వర్గాలుగా విభజింపబడ్డ ఓటర్లందరూ ఇకమీదట Jugaad Bharat United Votèrs గా వ్యవహరిస్తారు.

6. 25 నుండి 60 సంవత్సరముల వయస్సు కలిగిన యువతీ-యువకులందరికీ "ప్రతిపాదిత జుగాడ్ పార్టీ ఓటరు" గా ఇదే నా వ్యక్తిగతమైన ఆహ్వానం! సంఘటితంగా ఒక ప్రయత్నం చేద్దాం రండి. సమిష్టి నిర్ణయాలతో పార్టీ నిర్మిద్దాం, త్వరపడండి.

Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:



We saw that the collector got worms in her plate when she came to our school on November 21 to have lunch with us. We saw her reaction... After she saw the worms, she ordered fresh food to be prepared — Students

There is a government primary school, Margadarsi school and a government high school in the vicinity... But how can only students from Maganooor ZPHS be affected? — Varadarajan, kirana shop owner on Kurkure being blamed by for food poisoning

**Seethakka's take**

- **42 incidents** of food poisoning reported in residential schools this year
- Government has not determined whether the cause of food poisoning in the Wankidi Tribal Welfare Residential School is food or water contamination.
- Substandard food materials being supplied to institutions
- Government delays in releasing bills for suppliers

29-11-2024 Hyderabad

advt

# కులగణన - రిజర్వేషన్లు




## -జేపీతో ప్రత్యేక ఇంటర్వ్యూ-

**? కులగణన ప్రారంభమైంది తెలంగాణలో. దిసీజ్ ఎ సోషల్ ఎక్స్ రే అండ్ ఎక్స్‌పరిమెంట్ అంటున్నారు రాహుల్‌గాంధీ. ఇది ఎక్స్‌పరిమెంట్ కాదు, ప్రజల్ని మభ్య పెట్టేందుకు అంటోంది బీజేపీ. ఇప్పుడు రిజర్వేషన్ల అమలు సక్రమంగా జరగాలి అంటే, కులగణన కావాల్సిందే అని చెబుతున్నటువంటి మేధావులు, విద్యావంతుల మాటలు నమ్మాలా, లేకపోతే కులగణన ముసుగులో మరేదో జరగబోతోందన్నది నమ్మాలా?**

**జేపీ:** ముందు అర్థం చేసుకోవలసింది భారతదేశంలో కులవ్యవస్థ ఉన్నమాట వాస్తవం. కొన్ని కులాల్ని, బలహీన వర్గాల్ని గాని, దళితుల్ని గాని, ఆదివాసీల పట్ల గానీ కులం పేరుతో, పుట్టుక పేరుతో వివక్ష చూపెట్టిన మాట వాస్తవం. శతాబ్దాలుగా ఆ కారణంగా తెలివితేటలున్నా అవకాశాలు లేకుండా పోయిన మాట వాస్తవం. ఆ కారణంగానే దేశంలో ఏకాభిప్రాయంతో రాజ్యాంగం వచ్చిన కొత్త నుంచి కూడా అన్ని పార్టీలూ కలిసి, అటు రాజ్యాంగంలో రాసుకున్నాం, తర్వాత అమలు చేశాం రిజర్వేషన్లను. కచ్చితంగా రిజర్వేషన్లు కావాలి విద్యలోగాని, ఉపాధిలోగాని. దానికి ఎవరూ కాదనటంలా. ఈ రిజర్వేషన్లకి, కులగణనకి ఏమాత్రం సంబంధం లేదు. నేను చాలా స్పష్టంగా ముందు ప్రజలకు అర్థమయ్యేట్లు చెప్పదలచుకున్నాను. కులగణన అనేది సామూహికంగా జరిగేది. రిజర్వేషన్లు వ్యక్తిగతమైనవి. మీకు సర్టిఫికెట్ ఉంటే, మీకు అర్హత ఉంటే, రిజర్వేషన్లకి అర్హులవుతారు. అర్హతల్లో బలహీన వర్గాల వరకు జాతీయ స్థాయిలో సుప్రీంకోర్టు ఏమిచ్చిందంటే, ఒక క్రీమీలేయర్, అంటే ఆదాయం ఒక పరిమితి దాటితే మీకు అర్హత ఉండకూడదు, బీదలకు వెళ్లాలి రిజర్వేషన్లు అని. ఏమన్నా తేడా ఉంటే, ఈ కులగణనలో వ్యక్తుల, కుటుంబాల ఆస్తుల గురించి సవివరమైన వివరాలు తీసుకున్నట్లయితే, బలహీన వర్గాలకు వర్తిస్తుంది అది, ప్రస్తుతం మన దేశంలో ఉన్నటువంటి చట్టం ప్రకారం, కోర్టు తీర్పుల ప్రకారం, ఆ బలమైన వర్గాల్లో కొందరు బీదరికం నుంచి బయటపడ్డారు, ఈ క్రీమీలేయర్‌లో ఉన్నారు అని చెప్పి తేలినట్లయితే, వాళ్లకు వ్యక్తులుగా రిజర్వేషన్ రాదు. అది ఇప్పటికే చట్టం ఉన్నది. కొత్తకాదు అది. అది మినహాయించి రిజర్వేషన్లకి, కుల గణనకి సంబంధం లేదు. మీకు గనక అర్హత ఉన్నట్లయితే, ఆ కులాల సర్టిఫికెట్ ఉన్నట్లయితే, నిజంగా ఆ కులాలకు చెందినవారయితే, మీరు రిజర్వేషన్‌కి అర్హులు. కులగణన వల్ల మీకు పెరిగేది లేదు, తగ్గేది లేదు. ఇక రెండోది, రాజ్యాంగంలో రెండున్నాయి. ఒకటి, పరిపాలన, ఉద్యోగాలు ఉన్నది సామర్థ్యం కోసం. మనకి సేవలు అందింటానికి, పన్నుల డబ్బులు తీసుకుంటున్నారు. ఆ పన్నుల డబ్బులతో మనకు సేవలు అందించాలి. సేవలు ప్రధానంగా ఎవరికి కావాలి?నిరుపేద వర్గాలకి కావాలి. మంచి స్కూళ్లు బాగా నడిచాయి, ఎవరికి కావాలి? డబ్బున్నవాళ్లకి గవర్నమెంట్ స్కూళ్లు అవసరమా? డబ్బున్నవాళ్లు, మధ్య తరగతి అయినా సరే గవర్నమెంట్ స్కూళ్లకి పంపిస్తున్నారా పిల్లల్ని? లేదు! ఇటీవలికాలంలో గవర్నమెంట్ కాలేజీలకు కూడా పంపించటం తగ్గించేశారు. ఏదో కొన్ని ఐఐటీలు, మెడికల్ కాలేజీలు లాంటివి తప్పితే, గవర్నమెంట్ కాలేజీలకు పంపించటం తగ్గించేస్తున్నారు. కాబట్టి ఎవరికి అవసరం విద్య బాగుపడితే? అలాగే మంచి ఆరోగ్యం అందిందనుకోండి మనకి, ఎవరికి అవసరం అది? డబ్బున్నవాళ్లకి అవసరం లేదు. డబ్బున్నవాళ్లు, గేటెడ్

కమ్యూనిటీలు పెట్టుకుంటున్నారు, హాయిగా బతుకుతున్నారు, ప్రైవేటు ఇన్సూరెన్స్ పెట్టుకుంటున్నారు, డబ్బులు ఖర్చు పెట్టుకుంటున్నారు, ఫైవ్‌స్టార్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. నష్టపోతున్నదెవరు? సామాన్యులు. కాబట్టి ప్రభుత్వం సమర్థంగా పనిచేయటం బీదలకి, బలహీన వర్గాలకి, దళితులకి, ఆదివాసీలకు అత్యవసరం. అంచేత, ప్రభుత్వం ఉద్యోగాలిచ్చే ఒక సంస్థ కాదు. ప్రభుత్వం ప్రజలకు ఉమ్మడి సేవలను అందించే బాధ్యత గల సంస్థ. అందుకోసం పన్నులిచ్చి మనం పోషిస్తున్నాం. ఓటేసి మనం పదవుల్లో కూర్చోబెడుతున్నాం. మనం ఇప్పుడు ఏం చేశాం? రిజర్వేషన్లను పక్కనపెట్టేయండి, రిజర్వేషన్లతో నిమిత్తం లేకుండా కూడా, గవర్నమెంట్ అంటే ఉద్యోగాలివ్వటం కోసం అన్నట్లు తయారుచేశాం. తెలంగాణ ప్రభుత్వం ఈ మధ్యకాలంలో 11,000 ఉద్యోగాలు టీచర్లను నియమించాం అని ప్రకటించింది. విద్యను బాగు చేశామని ఒక్కమాట చెప్పారా? విద్యా ప్రమాణాలు ఇంత అధ్వాన్నంగా ఉన్నాయి, దాన్ని ఇంత బాగు చేశాం అని ఒక్క మాట రాలా. తెలంగాణలోనే కాదు, అన్ని రాష్ట్రాలలో విద్యాప్రమాణాలు అధ్వాన్నంగానే ఉన్నాయి. తెలంగాణలో నూటికి 50 మంది గ్రామీణ పిల్లలకి 14-18 సంవత్సరాల మధ్య వయసు వారికి గడియారం చూసి టైం చెప్పటం రాదు. గంట, నిముషం చెప్పమంటే నూటికి సగం మంది చెప్పలేక పోతున్నారు. మార్కెట్‌లో కూరగాయలు తూకం వేయమంటే, తూకం రాళ్లు వేయటం చేత కాదు. నాలుగు కేజీలు కావాలంటే, నాలుగు కేజీల రాళ్లంటే తెలియదు. ఇదీ మనకున్న పరిస్థితి. ఎవరు ప్రధానంగా నష్టపోతున్నది? బీద కుటుంబాల నుంచి వచ్చినవారు. తల్లిదండ్రులకు విద్య లేనప్పుడు, గవర్నమెంట్ స్కూల్స్‌కి వెళ్తున్నప్పుడు, వాళ్లు ప్రధానంగా నష్టపోతున్నారు. మరి వీళ్లందరి జీవితాల్ని బాగుచేయాలంటే, విద్య, ఆరోగ్యం ప్రధానం. కాబట్టి ప్రభుత్వం సమర్థంగా పనిచేయకపోతే నష్టపోయేది రిజర్వేషన్ పొందుతున్న వర్గాలు. కాబట్టి, అటు సామర్థ్యాన్ని చూసుకోవాలి, శక్తి సామర్థ్యాలను పెంచాలి, ఈ పిల్లలకి దేవుడిచ్చిన తెలివితేటలు వికసించేట్లు చేయాలి. రెండో పక్కన, రిజర్వేషన్లు ఇవ్వాలి. అందుకని సుప్రీంకోర్టు ఏం చేసిందంటే, ఒక సమతూకాన్ని పాటించాలి. 50 శాతం రిజర్వేషన్లు క్యాప్ అన్నారు. దాన్ని మార్చటానికి ఎవరికీ అవకాశం లేదు. అంచేత ఈమధ్య ఎకనామికల్లీ వీకర్ సెక్షన్లు, ఆదాయం తక్కువ ఉన్నట్లయితే, ఏ కారణం చేత యినా మినహాయింపు ఇచ్చారు. కానీ అది వేరు, కులానికి ఇంతని చెప్పటం లేదు కాబట్టి అని సుప్రీంకోర్టు చెప్పింది. ఇక అంతే. ఎండ్ ఆఫ్ ది స్టోరీ. ఇప్పుడు కులగణనకి




రిజర్వేషన్లని ముడిపెట్టటం అన్నది, చట్టంలో అలాంటిది లేదు, రాజ్యాంగంలో ఆ అవకాశం లేదు. రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నారు. ఇక అది పక్కన పెట్టేద్దాం.

కులాన్ని రాజకీయం తీసుకురాలా. కులం సమాజం నుంచే వచ్చింది. కుల నిర్మూలనకు రాజకీయం సరైన ప్రయత్నం చేయటంలా నా దృష్టిలో. మంచి విద్య అందకుండా, తెలివితేటలు వికసించకుండా, మంచి ఆరోగ్యం, సంపాదించే శక్తి పెరగకుండా కులం పోదు. ఆ తర్వాత వ్యక్తులు క్రమక్రమంగా కులాని కంటే తమ ఆనందాన్ని దృష్టిలో పెట్టుకుని నచ్చిన వ్యక్తిని తమ జీవిత భాగస్వామిగా ఎంచుకుంటే క్రమక్రమంగా కులం పోతుంది. ప్రభుత్వం పాత్ర అవకాశాలు పెంచటం, మంచి విద్యను అందించటం, పుట్టుక వాళ్లకు అవరోధం కాకుండా చేయటం. ఫలానా తల్లి గర్భాన పుట్టాను కాబట్టి నాకు బతుకు బాగోలేదు అనే భావం లేకుండా, కన్నీళ్లు కార్చాల్సిన అవసరం లేకుండా చేయటం. అక్కడ ఘోరంగా విఫలమైనాం మనం. విఫలమై, నిజంగా బీదరికాన్ని తొలగించటమెట్లా, వివక్ష నుంచి తొలగించటమెట్లా అని ఆలోచించకుండా కులగణనో మరోటో పేరుతో కుల సమీకరణ చేస్తున్నారు. ఎలక్షన్లు వచ్చినాయి, ఈ కులం మహాసభ, ఆ కులం మహాసభ. ఈ సోకాల్డ్ నాయకులంతా పోయి అక్కడ ఈ కులం తరపున మాట్లాడుతుంటారు. ఆధునిక ప్రజాస్వామ్యంలో కాలక్రమేణా కులం స్పృహను పోగొట్టి, కులం వల్ల వచ్చిన ఆత్మన్యూనతను పోగొట్టి, ఎదిగే అవకాశాల్ని కల్పించవలెనా? కులం పేరుతో మరింతగా సమాజాన్ని విభజించవలెనా? మన పిల్లలు కోరుకునేదేమిటి? అన్నెపున్నెం ఎరుగని అమాయకపు పిల్లలు, పుట్టినప్పుడు వాళ్లకేమన్నా కులం ఉందని తెలుసా, మనం చెప్పాం వాళ్లకి

మీ కులం ఫలానా అని. లేనటువంటి విభేదాలు మనం సృష్టించాం. మన ఖర్మ కొద్దీ ఈ దేశంలో ఉన్నాయవి. దాన్ని, ఓ పక్కన అణగారిన వర్గాలకు అవకాశాలు పెంచే ఏర్పాటు చేస్తూ, మరోపక్క కులం స్పృహ లేకుండా, రోజువారీ మాటల్లో నీ కులమేంటి, నా కులమేంటి, నువ్వు ఎక్కువ, నేను తక్కువ ఆ భావం రాకుండా చేయాలి గదా మనం. మీరు రోజూ కులం చుట్టూ రాజకీయాన్ని తిప్పితే, ఎలక్షన్లలో ఓట్ల సమీకరణలో కావచ్చు, కుల మహాసభల్లో మీ భాగస్వామ్యం కావచ్చు, కులగణన గురించి ఇంత చర్చ కావచ్చు, ఏం చెబుతున్నారు మీరు? కులం స్పృహను పెంచుతున్నారా, కులం స్పృహను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారా? ఆధునిక యుగంలో పట్టణీకరణ జరుగుతున్నప్పుడు ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం పెరగాలంటే మీ వల్ల ఏం జరుగుతుంది? ఓ మంచి డాక్టరు, డాక్టర్‌గా బాగా చూస్తున్నాడా లేదా? ఒక మంచి టీచర్. ఒక మంచి సాఫ్ట్‌వేర్ వర్కర్. అది ముందు చూడాలి మనం. అంతేగదా! కులమేంటో చూడకూడదు. ప్రాచీన గ్రామాల్లో

*మన సమాజంలో క్రమ క్రమంగా కులం స్పృహ లేకుండా ఎలా చేయాలి అని ఆలోచించాలా, కులం చుట్టూ రాజకీయం చేయాలా? ఇది ఏ రకంగా గొప్ప రాజకీయం అవుతుంది? కుల నిర్మూలన కావాలంటూ, మరోపక్కన రోజూ కులం గురించే ప్రస్తావన తీసుకొస్తుంటే అది ఏ రకంగా ప్రగతిశీలకమవుతుంది?*

ఏం జరిగేది, నీకు ఎంత ప్రతిభ ఉంది, నీ వల్ల ఏం జరుగుతుంది అని చూడలా. నీ కులం ఏంటని చూసేవాళ్లం. పట్టణీకరణ, ఆధునికీకరణ, ఆధునిక ఆర్థిక వ్యవస్థ అంటే ఏమిటి అర్థం, క్రమక్రమంగా నీ పుట్టుక కాకుండా నీ వల్ల ఏం జరుగుతుందనే చర్చ కావాలి. ఇప్పుడు ఇలాంటి చర్చ ఏం జరుగుతోంది? నీ వల్ల ఏం జరుగుతోంది అని కాకుండా, నీ పుట్టుక చుట్టూ చర్చ జరుగుతోంది. అది ప్రగతిశీలకమైన చర్చ ఎట్లా అవుతుంది? అందుకే నేను యువతను కోరుతున్నాను. మీ రిజర్వేషన్లకి ఏమీ ఢోకా లేదు. వాళ్లొచ్చి సర్వే చేస్తే, మీరేమీ వివరాలు ఇవ్వనక్కర్లేదు. కులం అడిగితే బ్లాంక్ పెట్టండి. రిజర్వేషన్లు మీకు ఉంటాయి. మీకు ఏ రకంగానూ పోవు. క్యాస్ట్




సర్టిఫికెట్ వ్యక్తిగతంగా మీ కుటుంబానికి, మీకు ఉన్నప్పుడు రిజర్వేషన్లకి మీకు అర్హత ఉంటుంది. కానీ ఈ రొచ్చులో మీరు పడాల్సిన అవసరం లేదు. ఎల్లకాలం ఫలానా కులం వాడినని చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఉండకూడదు. అందుకే నేను ఎన్నోసార్లు మళ్లీమళ్లీ పిలుపునిచ్చాను. ఒకటి, చేతనైన మేరకు కులం పేరు లేకుండా చేయటం మీ పేరులో. ఆ పేరు వెనకాలో, ముందో కులం వద్దు. వీలున్నంత వరకూ చేయండి. రెండు, ముందు మీ ప్రతిభను ఉపయోగించుకోండి. దేవుడిచ్చిన తెలివితేటల్ని ఉపయోగించుకోవటానికి సర్వశక్తుల్నీ ఒడ్డండి. ప్రభుత్వం చేయటంలా. కనీసం మీరు, మీ కుటుంబం నానాతంటాలు పడండి. అదొక్కటే, భవిష్యత్తుకి మంచిది. అంత స్థాయిలో ఎదిగే మార్గాల్ని సాధించండి, ఆదాయాల్ని పొందండి. ఆత్మగౌరవంతో పనిచేయండి. ఒక పని ఎక్కువ, తక్కువ అనుకోవద్దు. మూడు, మీరు స్థిరపడ్డ తర్వాత ఆర్థికంగా మీ కాళ్ల మీద నిలబడ్డ తర్వాత, జీవిత భాగస్వామిని ఎంచుకునేటప్పుడు ఆదర్శం కోసం పెళ్లి చేసుకోమని అనటంలా, ఆనందం కోసం పెళ్లి చేసుకోండి. మీకు జీవితమంతా పంచుకునే మనిషి కావాలి. మీరు ఆడపిల్లయితే ఎలాంటి భర్త కావాలి, మగపిల్లాడయితే ఎలాంటి భార్య కావాలి. జీవితమంతా మీకు ఆనందాన్నిచ్చే మనిషి కావాలి. జీవితంలో తోడు కావాలి. మనసున మనసై, బతుకున బతుకై. ఆ మనసు పంచుకుని మీకు ఆనందాన్నిచ్చే భాగస్వామిని ఎంచుకోండి. ఆదర్శం కోసం కాదు. ఆ భాగస్వామి మీ కులంలోనే దొరికారనుకోండి. ఓకే. నేను కాదనటం లేదు. కానీ కులాన్ని చూసి కాకుండా మీ ఆనందం కోసం ఎంచుకోండి. అప్పుడు రెండు మూడు తరాల్లో క్రమ క్రమంగా కులం స్పృహ తగ్గిపోతుంది. ఇట్లా మన సమాజంలో క్రమక్రమంగా కులం స్పృహ లేకుండా ఎలా చేయాలి అని ఆలోచించాలా, కులం చుట్టూ రాజకీయం చేయాలా? ఇది ఏ రకంగా గొప్ప రాజకీయం అవుతుంది? కుల నిర్మూలన కావాలంటూ, మరోపక్కన రోజూ కులం గురించే ప్రస్తావన తీసుకొస్తుంటే అది ఏ రకంగా ప్రగతిశీలకమవుతుంది? ✦

# సంక్షోభాన్ని మనం అవకాశంగా మలచగలమా?

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

అదానీ గ్రూప్‌పై అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు, సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ కమిషన్ చేసిన ఆరోపణలు భారత రాజ్యవ్యవస్థకు పెను సవాలు విసురుతున్నాయి. అంబానీ, అదానీ, టాటాలు మన దేశంలో పెద్ద కార్పొరేట్ గ్రూప్‌లు, వచ్చే మూడు దశాబ్దాల్లో భారతదేశ అభివృద్ధి ఆకాంక్షలు నెరవేరటానికి వారి పాత్ర కీలకం. అందువల్ల ఆ సంస్థలు మన జాతీయ ఛాంపియన్లు. మౌలిక వసతులు భారత్‌కి పెద్ద ఎత్తున అవసరం. రాబోయే కొన్ని సంవత్సరాల్లో ఈ మూడు గ్రూప్‌లే 250 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు ప్రకటించాయి.

1991 వరకు మన దేశంలో కొనసాగించిన లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యం భారీ అవినీతిని, ప్రభుత్వ వనరుల దోపిడీ వ్యవస్థని పెంచి పోషించింది. ఆర్థిక సరళీకరణతో 1991 తర్వాతి కాలంలో ఉత్పత్తిదారుల మధ్య పోటీ, కొనుగోలుదారులకు ఎంపిక స్వేచ్ఛ పద్ధతి అమలైంది. అయితే ప్రభుత్వ వనరుల దోపిడీని, అవినీతి మయమైన రాజకీయ ఆర్థిక వ్యవస్థను నిర్మూలించటంలో భారత రాజ్యవ్యవస్థ విఫలమైంది. అధికార దుర్వినియోగంతో వ్యక్తిగత లబ్ధికి అర్రులు చాస్తుండటంతో అవినీతి విచ్చలవిడి అయ్యింది. విస్తృతంగా, జవాబుదారీతనం లేకుండా ఉన్న అధికార యంత్రాంగం వ్యాపారవేత్తలు, నిస్సహాయ పౌరుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేయటానికి రాజకీయంలో ఉన్న బలహీనతలు అవకాశంగా రూపొందాయి. సరఫరాదారులకు బకాయి ఉన్న బిల్లులు, బహిరంగ వేలం తర్వాత కూడా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, కాంట్రాక్టులు, భూమి, గనులు వంటి సహజ వనరుల కేటాయింపు, రకరకాల నియంత్రణాధికారాలు, పౌరులకు హక్కుగా, యధావిధిగా అందాల్సిన రోజువారీ సేవలు, సబ్సిడీల విడుదల, ఆస్తి బదలాయింపు రిజిస్ట్రేషన్, పన్ను మదింపులు, వ్యాపారులు-ప్రభుత్వం, పౌరులు-ప్రభుత్వం మధ్య పలు ఇతర లావాదేవీల్లో విపరీతమైన అవినీతి రాజ్యమేలుతోంది. ఒక ఏడాది కాలంలో భారతదేశంలోని కుటుంబాల్లో సగానికిపైగా ఏదో ఒక ప్రభుత్వ సేవకోసం గతిలేక లంచాలు చెల్లిస్తున్నారని సర్వేలు తెలియచేస్తున్నాయి. ఈ ప్రభుత్వ వనరుల దోపిడీ వ్యవస్థలో అవినీతి రాజకీయ నేతలు, బలవంతపు వసూళ్ల అధికార యంత్రాంగం తోడు దొంగలు.



చాలా మంది రాజకీయనాయకులు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు వ్యక్తిగతంగా నిజాయితీపరులు, అవినీతి వ్యతిరేకులు. కానీ ఓటర్లను ప్రలోభపరచటానికి, ఓట్లు కొనుక్కోవటానికి, భారీగా లెక్క చూపని, చట్ట విరుద్ధ వ్యయం మీద రాజకీయవేత్తలు ఆధారపడటం ఉన్న కొద్దీ ఎక్కువవుతోంది. తెలుగు రాష్ట్రాలలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన అభ్యర్థులు రూ. 25-30 కోట్లు ఖర్చు చేయటం మనందరికీ తెలుసు. ఈ వ్యవస్థీకృత అనివార్యతకు నిజాయితీ రాజకీయ నాయకులు కూడా బాధితులవుతున్నారు. నిజాయితీ సివిల్ సర్వెంట్లు అవినీతిని మరీ తీవ్రంగా ప్రతిఘటిస్తే, వారిని వేగంగా పక్కకి, అప్రాధాన్య పదవుల్లోకి నెట్టేస్తారు. లేదా వారి సహచరుల ద్వారానో, దిగువస్థాయి యంత్రాంగంతోనో డమ్మీలుగా మారుస్తారు. ఇలాంటి నేపథ్యంలో, అదానీపై నేరారోపణల వల్ల తలెత్తిన సవాలును మన రాజకీయ వ్యవస్థ ఎదుర్కోవల్సి వస్తోంది. అంతకు ముందున్న సోషలిస్టు జమానాలో పెట్టుబడులు పెట్టడం, సంపద సృష్టించటం పాపం అనే సంస్కృతి రూపొందింది. విలన్లుగా కంటే తరచూ బలవంతపు వసూళ్లకు బాధితులుగా ఉన్న ఆ కొన్ని పారిశ్రామిక సంస్థలను కూడా మనం నాశనం చేస్తే మన ప్రగతి అవకాశాలకి పూడ్చలేని నష్టం చేజేతులారా చేసినవాళ్లమవుతాం. అలాగని, అవినీతి మామూలే అనే యథాతథ వ్యవహారశైలిని కొనసాగించినా, దేశ ఆర్థికాభివృద్ధి బాగా కుంటుపడుతుంది. సంక్షోభాన్ని మనం అవకాశంగా మలచగలమా, ప్రజా జీవితంలో నిజాయితీకి, నిజమైన పోటీకి, నైతిక కార్పొరేట్ పాలనకు మన రాజకీయ సంస్కృతిని సమూలంగా మార్చటానికి మార్గం వేయగలమా- ఇదీ ప్రధానమైన ప్రశ్న.

అదానీ సంక్షోభం మన వ్యవస్థలోని కొన్ని లొసుగుల్ని ఎత్తి చూపుతోంది. ఈ కేసు ప్రతికూల ప్రభావం ఇప్పటికే స్పష్టంగా



కనిపిస్తోంది. 600 మిలియన్ డాలర్ల బాండ్ అమ్మకాలను అదానీలు రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఫ్రెంచ్ బహుళజాతి ఇంధన సంస్థ, టోటల్ ఎనర్జీస్ భారత్‌లో కొత్త పెట్టుబడుల్ని స్తంభింపచేస్తున్నట్లు ప్రకటించింది. అదానీ గ్రూప్ చేపట్టిన నైరోబీ విమానాశ్రయ పునర్నిర్మాణం, విద్యుత్ లైన్ల ఆధునీకరణ ప్రాజెక్టులను కెన్యా రద్దు చేసింది. వాటి విలువ 2.6 బిలియన్ డాలర్లు. రెండు అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు అదానీ పరపతి స్థాయిని తగ్గించాయి. అంటే మనం యథాస్థితిని కొనసాగిస్తూ అవినీతితో రాజీపడటం ఇక ముందు సాధ్యం కాదు, కారణాలేమయినా ఈ అవినీతి వల్ల మన దేశంలో పెట్టుబడులు ఆగిపోయే ప్రమాదం కనిపిస్తోంది. అవినీతి రాజకీయ ఆర్థిక అవ్యవస్థను అంతం చేయటానికి భారతదేశం నిర్ణయాత్మకంగా వ్యవహరించి దేశానికి, ప్రపంచానికి బలమైన సంకేతాన్నివ్వాలి.

భారతదేశానికి బలమైన, క్రియాశీలమైన ప్రజాస్వామ్యం ఉంది. మన రాజకీయ స్వేచ్ఛలు, ఎన్నికల్లో తీవ్ర పోటీ నిష్పాక్షికంగా, ఎప్పటికప్పుడు నిర్దేశిత కాలానుగుణంగా జరిగే ఎన్నికలు, శాంతియుత అధికార బదిలీ, నిజమైన ఫెడరలిజం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, ఇంకా ప్రజాస్వామిక వ్యవస్థలు, పద్ధతులు మనం గర్వించదగినవి. ప్రజాస్వామ్య భారతం మనుగడ అసాధ్యం అన్న జోస్యాల్ని వమ్ము చేస్తూ మన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నాం. ఇదే సమయంలో మన లక్ష్యాలు అనేకం అసంపూర్ణంగా కూడా ఉన్నాయి. విస్తృత పేదరికం, అరకొర పౌర చైతన్యం, బలహీన స్థానిక ప్రభుత్వాలు, అధికార యంత్రాంగంలో మొక్కుబడి జవాబుదారీతనం, ఒక్క ఓటు ఎక్కువ వస్తే గెలిచినట్లు, మిగిలిన వారికి ఎన్ని ఓట్లు వచ్చినా వృథా అనే ఫస్ట్-పాస్ట్-ది- పోస్ట్ పద్ధతి ఇవన్నీ మన ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తున్నాయి; మన ఆర్థిక వ్యవస్థని కుంగదీసి బీదరికాన్ని కొనసాగిస్తున్నాయి.

మన పాలనా సవాళ్లను చూసి మనం ఆత్మన్యూనతకు లోనవనక్కర్లేదు. పంతొమ్మిదో శతాబ్దపు మధ్యకాలంలో బ్రిటన్‌లో భయంకర అవినీతి ఉండేది. ఎన్నికల్లో నియోజకవర్గాలను వేలం వేసి కొనుక్కునే వారు. ఇలాంటి సంక్షోభంలో గ్లాడ్‌స్టోన్, ఇతర నాయకులు రాజకీయ సమస్య ఎక్కడ ఉందో గుర్తించి తగిన సంస్కరణల్ని అమలు చేశారు. అంతే, 19వ శతాబ్దపు చివరినాటికి బ్రిటిష్ వ్యవస్థ సమూలంగా మారిపోయింది. అమెరికానే తీసుకుంటే న్యూయార్క్‌లో టామ్మనీ హాల్ రాజకీయాలుండేవి. పలు రాష్ట్రాల్లో మెషీన్ రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం రాజ్యమేలేవి, జిమ్ క్రో చట్టాల రూపంలో వర్ణ వివక్ష కొనసాగుతుండేది. ఇరవయ్యో శతాబ్దం దాకా ఇదే పరిస్థితి. అమెరికా రాజ్యవ్యవస్థ ఈ సవాళ్లను ఎదుర్కొని, పార్టీ వ్యవస్థని, ఎన్నికల్ని, విభజన ధోరణుల్ని ఒక పద్ధతి ప్రకారం దశాబ్దాల పాటు సంస్కరించుకుంటూ వచ్చింది. తన

*భారతదేశానికి బలమైన, క్రియాశీలమైన ప్రజాస్వామ్యం ఉంది. మన రాజకీయ స్వేచ్ఛలు, ఎన్నికల్లో తీవ్ర పోటీ , నిష్పాక్షికంగా, ఎప్పటికప్పుడు నిర్దేశిత కాలానుగుణంగా జరిగే ఎన్నికలు, శాంతియుత అధికార బదిలీ, నిజమైన ఫెడరలిజం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, ఇంకా అనేక ప్రజాస్వామిక వ్యవస్థలు, పద్ధతులు మనం గర్వించదగినవి. ప్రజాస్వామ్య భారతం మనుగడ అసాధ్యం అన్న జోస్యాల్ని వమ్ము చేస్తూ మన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నాం. ఇదే సమయంలో మన లక్ష్యాలు అనేకం అసంపూర్ణంగా కూడా ఉన్నాయి.*

రాజకీయాల్ని, చట్టబద్ధపాలనని సంస్కరించుకోవటానికి భారత్‌కి ఇప్పుడు సమయం ఆసన్నమైంది.

ఎన్నో ఏళ్లుగా అనేక రచనలు, ప్రసంగాలలో నేను ఓ మౌలిక ప్రశ్నను లేవనెత్తుతున్నాను. 19వ శతాబ్దపు రాజకీయాలు, 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థ కలసి మనుగడ సాగించగలవా? ఇప్పుడొచ్చిన అవినీతి ఆరోపణలపై మనం సీబీఐ, రాష్ట్ర అవినీతి నిరోధక సంస్థలతో చురుగ్గా దర్యాప్తు జరిపించాలి. వివరాల్ని వెల్లడించాల్సిన నిబంధనలు ఇతరత్రా చట్టపరమైన ఉల్లంఘనలపై 'సెబి' వేగంగా దృఢంగా వ్యవహరించాలి. పారదర్శకంగా, ఎవరైనా వివరాల్ని నిగ్గుతేల్చుకునేలా సరైన పద్ధతిని అనుసరించాలి.

ముడుపులు తీసుకున్న వారందరికీ ప్రత్యేక కోర్టుల ద్వారా కఠినమైన హెచ్చరికలు ఉండే శిక్షలు విధించాలి. ఆర్టికల్ 253 కింద లోక్‌పాల్ తరహాలో రాష్ట్రాల్లో బలమైన లోకాయుక్తలను పార్లమెంట్ వేగంగా ఏర్పాటు చేయాలి. అంతర్జాతీయ ఒప్పందాలున్న అవినీతికి సంబంధించిన అంశాలపైన రాష్ట్రాలకి కూడా వర్తించే చట్టం చేసే అధికారం 253వ అధికరణం ద్వారా పార్లమెంట్‌కి ఉంది. లోక్‌పాల్, లోకాయుక్తలకు సిబ్బందిని, వనరుల్ని కేటాయించాలి. సీబీఐ, రాష్ట్ర అవినీతి నిరోధక సంస్థలను వాటి పరిధిలోకి తేవాలి. ఈ ఏర్పాట్లు దేశానికి, ప్రపంచానికి కూడా బలమైన సంకేతాన్నిస్తాయి.

ఓటరును ప్రలోభపరచటానికి లెక్కలు చూపని చట్టవిరుద్ధ వ్యయం అవసరాన్ని నిర్మూలించేందుకు అవసరమైన ఎన్నికల సంస్కరణలపై చర్చను లేవనెత్తి ఏకాభిప్రాయసాధనకు ప్రధానమంత్రి చొరవ తీసుకోవాలి. నరేంద్రమోదీ లాంటి వ్యక్తిగతంగా అవినీతి మచ్చలేని బలమైన నాయకుడు మాత్రమే ఈప్రక్రియకు సారథ్యం వహించగలరు. సుస్థిర వేగవంత ఆర్థిక ప్రగతి ఈ వేళ మనకు అందుబాటులో ఉంది. కానీ మన ఆర్థిక ఆకాంక్షలకు అనుగుణమైన రీతిలోకి మన రాజకీయాల్ని, పాలనను భారత్ తేవాలి. 1991 తర్వాత రెండో అంచె సంస్కరణల కోసం భారత్ ఎదురుచూస్తోంది.

# కొరవడిన సం'క్షేమం'

-బండారు రామ్మోహనరావు

***ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడి పాఠశాల వసతి గృహంలో భోజనం తిని 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో శైలజ అనే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది.***

---------------------------

***నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజుల తర్వాత మళ్లీ అదే పాఠశాలల్లో 30 మంది అస్వస్థతకు గురయ్యారు.***

---------------------------

**జగిత్యాల జిల్లాలో నాలుగు నెలల క్రితం ఒక బాలుడు మధ్యాహ్న భోజనం వికటించి చనిపోయాడు.**

---------------------------

***ఈ తరహా ఘటనలు రోజూ ఎక్కడో ఒక చోట జరుగుతున్నాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. ప్రిస్క్రిబ్డ్ మెనూ కూడా అమలు కావడం లేదు. మధ్యాహ్న భోజన పథకం లక్ష్యాన్ని దెబ్బతీసేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పథకం లక్ష్యం అమలు నీరుగారుతున్న వైనం, విద్యార్థుల్లో పోషకాహార లోపం..క్రమంగా మళ్లీ డ్రాపవుట్స్ పెరిగే అవకాశం తదితర అంశాలను ప్రస్తావిస్తూ పరిష్కారాలను సూచించే వ్యాసం.***

సుమారు 50 సంవత్సరాల క్రితం "మనుషులు మారాలి" అనే సినిమాలో పేదల బ్రతుకుల గురించి..

***"ఇంతేలే నిరుపేదల బ్రతుకులు. అవి ఏనాడు బాగుపడని అతుకులు. ఇంతేలే ! ఇంతేలే!!.***

***"కాళ్లకు సంకెళ్లు, చేతికి సంకెళ్లు, కళ్ళకు సంకెళ్లు, నుదుటి రాతకి సంకెళ్లు"*** అంటూ ఓ పాట రాశారు. నేడు హాస్టళ్లలో పిల్లల దుస్థితి చూస్తే ఆ పాట గుర్తుకొస్తుంది.

తెలంగాణలోని అనేక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థత గురికావడమే కాక అక్కడ క్కడా మరణిస్తున్నారు. గురుకుల పాఠశాలల పేరుతో పెద్ద ఎత్తున రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించారు. వాటిలోనూ భోజన ఏర్పాట్లలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి.

"ఆకలికి అన్నము..వేదనకు ఔషధం" అన్నారు. ఆకలి అయినప్పుడే భోజనం చేయాలి ఆకలి కాకుండా అన్నం తింటే వాంతి అవుతుంది. నొప్పి కలిగినప్పుడే మందు పెట్టాలి. నొప్పి లేని చోట జీడి రాస్తే పెద్ద పుండు అవుతుంది. ఆకలితో ఉన్న వాడికి చదువు ఎలా మనసున పడుతుందనే ఆలోచన చేసిన ఆనాటి ప్రభుత్వాలు జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే అమెరికా సహకారంతో భారతదేశం అంతా ఉదయం



11:30 కి అమెరికా వారు సప్లై చేసిన గోధుమ ఉప్మా తోపాటు పాలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే వారు. 60 సంవత్సరాల క్రితమే నా విద్యార్థి జీవితంలో నేను మా ప్రజ్ఞాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలలో ఆ పాలు తాగాను, ఉప్మా తిన్నాను. ఆ తరువాత తమిళనాడులో అప్పుడు అధికారంలో ఉన్న ద్రవిడ పార్టీలు మధ్యాహ్న భోజన పథకాన్ని మొట్టమొదటిసారిగా ప్రవేశ పెట్టాయి. ఆ తర్వాత ఈ పథకం మన తెలుగు రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా విస్తరించింది.

ఒకటి నుండి 8వ తరగతి వరకు దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కేంద్ర ప్రభుత్వం సహకారంతో అమలవు తుంది. ఇందులో కేంద్రం 60 శాతం డబ్బులు భరిస్తుండగా మిగతా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. ఇక తొమ్మిది, పదో తరగతి పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వాలే మధ్యాహ్నం భోజనం ఖర్చు భరిస్తున్నాయి. అన్ని తరగతులకు మధ్యాహ్న భోజనం పథకంలోని బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే అందిస్తున్నాయి. ఇక ఎక్కడికక్కడ ఆయా పాఠశాలల్లో వంట ఏర్పాట్లు చేసి స్థానికంగా ఉన్న డ్వాక్రా మహిళా సంఘాలు, ఇతరత్రా స్వయం సహాయక సంఘాల ద్వారా వంటలు చేసి ఈ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మరికొన్నిచోట్ల అక్షయ ఫౌండేషన్, నాంది ఫౌండేషన్, ఇస్కాన్ స్వచ్ఛంద సంస్థలతో కేంద్రీకృత వంటశాలలు ఏర్పాటు చేసి వరుసగా 100 కిలోమీటర్ల దూరం వరకు మధ్యాహ్న భోజనాన్ని వేడివేడిగా అందిస్తున్నారు. ఇది ఒక పద్ధతి. గ్రామాలలో అపరిశుభ్ర వాతావరణంలో వంట చేసుకోవడానికి వీలు కాదు కనుక ఆయా పాఠశాలలో ప్రభుత్వం ప్రత్యేక వంట గదులను కూడా నిర్మించింది. కానీ స్థానిక వంటావార్పు చేసేవారు నూటికి 90 శాతం మంది వంటగదులలో వంట చెరుకు మాత్రమే స్టాక్ పెట్టుకొని ఆరు బయట వంటలు చేస్తున్నారు. దీనివల్ల బయట నుంచి వచ్చే దుమ్ము. ధూళి తోపాటు ఇతరత్రా క్రిములు, కీటకాలు కూడా ఆ

వంటల్లో పడుతున్నాయనేది ప్రధాన ఆరోపణ. ఇక సంక్షేమ హాస్టళ్ల వంట గదులు ప్రత్యేకంగా ఉండి అక్కడ వంట చేస్తున్న సందర్భంలో కూడా పైన బల్లులు తిరగడం, పాతబడిన వంటపాత్రలు, బూజు పట్టిన శ్లాబులు అపరిశుభ్రమైన వంట గదులు.. వీటి వల్ల కూడా ఆహారం విషతుల్యం అవుతుందని మరొక ఆరోపణ. ఈ రెండు వాస్తవాలే. దానితోపాటు ఆహార పదార్థాలలో వాడే వస్తువులు కాలం చెల్లినవి కావడం, కుళ్లిపోయిన కూరగాయలు, పాడైన కోడిగుడ్లు వాడడం కూడా ఆహారం విషతుల్యం కావడానికి, పిల్లల ప్రాణాలు పోవడానికి కారణం అవుతున్నాయి. ఇటీవల ఆహార కల్తీ నిరోధక శాఖ హైదరాబాద్ నగరంలోని పెద్ద రెస్టారెంట్‌లు, స్టార్ హోటళ్లలో తనిఖీలు చేస్తే చాలా నిజాలు వెలుగులోకి వచ్చాయి. డబ్బులు తీసుకొని అన్నం పెట్టే పెద్ద పెద్ద హోటళ్లల్లోనే అపరిశుభ్రమైన వంట గదులు, కల్తీ వంట సామగ్రి, కుళ్ళిపోయిన మాంసం ఇతరత్రా వాడుతున్నప్పుడు స్కూల్ పిల్లలకు మధ్యాహ్నం భోజనం, హాస్టల్ పిల్లలకు మూడు పూటలా వంటలు చేసి పెట్టే వారి పరిస్థితి ఏమిటని మనం ఆలోచించాలి. భోజనం తయారు చేసే కాంట్రాక్టర్లు దాతృత్వం కోసం చేయడం లేదు. ఎంతో కొంత మిగిలించు కుందామని వారి ఆలోచన ఉంటుంది. అది సహజం కూడా. కానీ వంట సామగ్రి కోసం ఏవైతే ప్రభుత్వాలు డబ్బులు ఇస్తున్నాయో అవి సరిపోతున్నాయా లేదా అనేది మరొక పెద్ద సమస్య. ఉదాహరణకు నగరాల్లో హైదరాబాద్ తో సహ ఉభయ తెలుగు రాష్ట్రాలలో చాలా నగరాలు, పట్టణాలలో ఐదు రూపాయలకే భోజనం పెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే అన్నా క్యాంటీన్ల పేరుమీద పట్టణాలలో కూడా ఈ భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాదులో అన్నపూర్ణ పేరుతో సెంట్రలైజ్డ్ కిచెన్స్ ద్వారా ఆహారాన్ని పలు ప్రాంతాల్లో మధ్యాహ్న భోజనంగా ఐదు రూపాయలకే అందిస్తున్నారు. కానీ ఆ వంట ఏజెన్సీలకు సుమారు 20 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది. అంటే మిగతా 15 రూపాయలు ప్రభుత్వం భరించి ఈ పథకాన్ని అమలు చేస్తుంది. అంటే ఇక్కడ ఐదు రూపాయల భోజనం పై ప్రభుత్వం పెడుతున్న ఖర్చు 20 రూపాయలు అన్న మాట. అదే మధ్యాహ్న భోజనానికి పెట్టే ఖర్చును చాలా తక్కువగా ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఒకటి నుండి ఐదు తరగతుల వారికి భోజనం పెట్టే కాంట్రాక్టర్లకు లేకుంటే వంటావార్పు చేసే వారికి ఒక్కో విద్యార్థికి రూ. 5.45 పైసల చొప్పున ఇస్తున్నారు. ఈ రేట్లు 2022 సంవత్సరం నుండి అమలు అమలవుతున్నాయి. 2024 డిసెంబర్ 1 నుండి ఈ డబ్బు 6.19 పైసలకు పెంచారు. అలాగే ఆరు నుండి 8వ తరగతి పిల్లలకు ప్రస్తుతం రూ. 8.17 పైసలు చెల్లిస్తుండగా రూ. 9.29 పైసలకు పెంచారు. మధ్యాహ్న భోజనం ఖర్చు 2022లోనే చివరిసారిగా పెంచారు ప్రస్తుతం 2024లో పెంచిన డబ్బు ఏ మాత్రం సరిపోదు మధ్యాహ్న భోజనానికి ఇవాళ రూపాయలలో లెక్కించే బదులు కేవలం పైసలు లెక్కించడం పెద్ద పొరపాటు. రూపాయి కంటే తక్కువ ఉన్న చిల్లర నాణాలు రద్దు అయిన సందర్భంగా ఈ పైసలు లెక్క ఏమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని జీహెచ్ఎంసీ ఖర్చు చేసే ఐదు రూపాయల భోజనంతో పోల్చుకుంటే అందులో మూడవ వంతు మాత్రమే ప్రస్తుతం ఖర్చు పెడుతున్నారు. అలా కాకుండా ఐదు రూపాయల భోజనంతో సమానంగా మధ్యాహ్న భోజనం తయారీకి సుమారు 20 రూపాయలు ఇస్తే తప్ప మంచి ఆహారం అందించలేము. ఆ వైపుగా ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయా అంటే లేదనే చెప్పాలి. అరకొర డబ్బుతో మంచి ఆహారం పెట్టమని గ్రామాల్లో పేదలైన డ్వాక్రా మహిళలను కానీ స్వయం సహాయక బృందాలను కానీ ప్రభుత్వాలు ఎలా ఆదేశించగలుగుతాయి. ఇప్పటికే ఆయా సంఘాలకు గత ఐదు నెలలుగా భోజనం తయారు చేసిన బిల్లులు ఇవ్వని ఈ ప్రభుత్వం వారిని ఎలా కంట్రోల్ చేయగలుగుతుంది.

**పర్యవేక్షణ సంగతి ఏమిటి?**

మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ బాధ్యత ఉపాధ్యాయులకు అప్పగించడం సబబేనా అనే ప్రశ్న కూడా వస్తుంది. మధ్యాహ్నం భోజనంలో అవకతవకలు జరగకుండా ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు ఉపాధ్యాయులే బాధ్యులు అవుతారని ప్రభుత్వం హెచ్చరిస్తుంది. వారిని మధ్యాహ్నం పిల్లలతో కలిసి భోజనం చేయాలని ఆదేశిస్తుంది. తల్లిదండ్రుల సంఘాల వారు కూడా ఈ భోజన ఏర్పాట్లు అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని ప్రభుత్వం ఆశిస్తుంది. నిజమే ప్రజల భాగస్వామ్యం లేకుంటే ఏ పథకమూ సాధ్యం కాదు. కానీ ఎంతమంది నిరక్షరాస్య తల్లిదండ్రులు తమ పిల్లల బాగోగులను చూసి మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించగలుగుతారన్నది కూడా ప్రశ్న. ఈ అంశంలో ఉపాధ్యాయ సంఘాల వాదన కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పిల్లలకు చదువు చెప్పాలా లేకపోతే ఈ మధ్యాహ్న భోజనం పథకంతో పాటు అనేక అంశాలలో ప్రభుత్వం కోరుతున్న సమాచారం ఇవ్వాలా అనే వారి ప్రశ్న కూడా సరి అయిందే. అందుకే మధ్యాహ్న భోజనం పథకం సమర్థవంతంగా అమలు కావాలంటే ఉపాధ్యాయ సంఘాల సూచనలు కూడా తీసుకోవాలి. నేను మొదటి పేర్కొన్నట్లు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా అనేక స్వచ్ఛంద సంస్థలు ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ముందుకు వస్తున్నాయి. వారి ద్వారా ప్రతి జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి 50 నుండి 100 కిలోమీటర్ల దూరం వరకు వేడివేడి మధ్యాహ్న భోజనాన్ని అందించవచ్చు. సరిగ్గా ఈ సూచననే ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వులు తిరస్కరిస్తూ ఉపాధ్యాయ సంఘాలు కూడా చెబుతున్నాయి.

**సంక్షేమ హాస్టళ్లలో ఎలా చేయాలి?.**

ఇక గురుకుల పాఠశాలలలో మధ్యాహ్న భోజనం లాగా సెంట్రలైజ్డ్ కిచెన్స్ సాధ్యం కావు. ఎందుకంటే మధ్యాహ్న భోజనం పెట్టేది ఒక పూట మాత్రమే. కానీ హాస్టళ్ళలో ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కూడా పెట్టాలి.

కనుక పిడుక్కి బియ్యానికి ఒకే మందు పనికిరాదు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం నడుస్తుంది. దానికి రాజకీయ నాయకుల ఆశ్రిత పక్షపాతం కూడా అవినీతికి తావు ఇస్తుంది .రాజకీయ నాయకులు అవినీతితో పాటు విద్యా శాఖలో సంక్షేమ శాఖలో ఉన్న అధికారుల అవినీతి కూడా తోడవుతుంది.

**పరిష్కార మార్గాలు**

⏭ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎక్కడికక్కడ వంట చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్స్ నిర్వహించే సామర్థ్యం ఉన్న స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి సమర్థవంతంగా నిర్వహించాలి.

⏭ సంక్షేమ హాస్టల్లో కేవలం ఆహార సమస్యనే కాదు అక్కడ నివాసయోగ్యమైన పరిసరాలు లేకపోవడం కూడా మరొక సమస్య. రాష్ట్రంలో సుమారు 1000 వరకు కొత్తగా గురుకులాలు ఏర్పాటు చేశారు. వీటిలో సొంత భవనాలు లేనివే ఎక్కువ. అలాగే ఇప్పటివరకు మూతపడిన ఇంజనీరింగ్ కాలేజీలను ప్రభుత్వం అద్దెకు తీసుకొని వాటిలో నాలుగైదు గురుకులాలను కలిపి నడిపిస్తున్నారు. అటు వంటప్పుడు ఎస్సీ గురుకులం వేరు బీసీ గురుకులం వేరు మైనార్టీ గురుకులం వేరు అనకుండా అందరు విద్యార్థులకు ఒకే చోట వంట ఏర్పాటు చేసే విధంగా ఆయా హాస్టళ్ళలో సెంట్రల్ కిచెన్ ఏర్పాటు చేయాలి. అలాగే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక సెంట్రలైజ్ మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ పెడతామని ఆలోచన చేస్తుంది. అంటే రాష్ట్రంలో ఉన్న సుమారు 600 మండలాలలో ఈ మోడల్ పాఠశాలను వస్తాయి.అక్కడ అయినా ప్రత్యేకంగా వంటగది నిర్మించి సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసి ఆయా హాస్టళ్లలో పూర్తి ఆహార సౌకర్యాన్ని కల్పిస్తే ఇంకా బాగుంటుంది.

⏭ గురుకులాలలో సంవత్సరానికి విద్యార్థులకు ఇచ్చే యూనిఫాముల విషయంలో కూడా అవకతవకలు జరుగుతు తున్నాయి. వారికి చలికాలం కూడా ఆరు బయట వచ్చే నల్లాల దగ్గరనే స్నానం చేయడం కూడా మరొక సమస్య. వారికి స్థానం కోసం వేడి నీళ్ల ఏర్పాటు చేయాలి. పేదలంటే అలుసు కాదు బాధ్యత అనే విషయం ప్రభుత్వం గమనిస్తే ఇలాంటి పొరపాట్లు చేయదు.

చివరగా ఒక్క మాట! హాస్టల్లో ఉండేది పేద పిల్లలే కనక పేదల తలరాతలను మార్చే ప్రభుత్వాలు కావాలి కానీ వారిని నిర్లక్ష్యం చేస్తే ప్రజలు తిరగబడతారు. తస్మాత్ జాగ్రత్త. ❖

# ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ మళ్లీ రావాలి






గతంలో లాగా కుటుంబ వైద్య వ్యవస్థ పునరుద్ధరించాలని ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ మళ్లీ రావాలని దాని వైపుగా ప్రజలు, ప్రభుత్వం ఆలోచించాలని లోక్‌సత్తా ఉద్యమసంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు. ప్రపంచ ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ ప్రాక్టీషనర్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో తెలంగాణ ఆక్యు పంచర్ ఆక్యు ప్రెజర్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ల సదస్సులో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొ న్నారు. బ్రిటన్‌లో నేషనల్ హెల్త్ సర్వీస్ కింద సామాన్య పౌరుడుకి దేశ ప్రధానమంత్రికి అందే ఒకే విధమైన వైద్యాన్ని మనం కూడా మనదేశంలో ప్రవేశపెట్టాలని రామ్మోహనరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరొక ముఖ్యఅతిథి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ మాట్లాడుతూ లోక్‌సత్తా వారు ఆరోగ్యరంగంలో పెట్ట మంటున్న ఇలాంటి మంచి ఆలోచనల మార్పులతో దేశంలో అందరికీ వైద్యం ఉచి తంగా అందుతుందని అభినందించారు. ఈ కార్యక్రమానికి రావలసిన మరో ముఖ్య అతిథి లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ ఒక వీడియో సందేశాన్ని పంపారు. ఆక్యుపంక్చర్ వైద్యం డాక్టర్ ప్రాక్టీషనర్స్‌గా రిజిస్టర్ అయిన వారు మాత్రమే చేయాలని ఆక్యుప్రెజర్ వైద్యం మాత్రం చాలా మంది ప్రైవేట్ ప్రాక్టీ షనర్లకు కూడా నేర్పి రోగుల నొప్పి నివారణకు పూనుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేశంలోనే ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు డాక్టర్ అలోక్ సమావేశానికి హాజరైన వందలాదిమంది వైద్యులకు ఆక్యుపంక్చర్ వైద్యంలో తనకున్న అపారమైన అనుభవాన్ని రంగరించి ఉదాహరణలతో సహా వివరించారు.ఈ కార్యక్రమంలో బెంగుళూరు నుంచి వచ్చిన తెలుగు యువతి ఆక్యు పంక్చర్ డాక్టర్, హిమాలయన్ అడ్వెంచరిస్ట్ డాక్టర్ హారికతో పాటు సామాజిక ఉద్యమకారుడు కప్పర ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెజర్ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నేలపట్ల సుధీర్ అధ్యక్షత వహించారు. కార్యదర్శులు అనిల్‌కుమార్ డాక్టర్ త్రివిక్రమ్ తదితరులు ప్రసంగించారు.

# భారత ప్రజాస్వామ్య పునాదుల్లో పగుళ్లు

**73వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా రూపొందించిన పంచాయతీరాజ్ చట్టం-1994 అమలులోకి వచ్చి ఏప్రిల్ 2024 నాటికి 30 సంవత్సరాలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటికీ పంచాయితీరాజ్ సంస్థల బలోపేతం గురించి, అధికారాల బదలాయింపు విషయమై చర్చించుకోవాల్సిన పరిస్థితి బాధాకరం. ఇందుకు బాధ్యులెవరు? లోపం ఎక్కడుంది?**

-పరదేశి.కె.ఎరికిపాటి-




అసలు 73వ రాజ్యాంగ సవరణ చట్ట నిర్మాణం పటిష్టంగా లేదు. రాజ్యాంగం పదకొండో షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలకు సంబంధించిన అధికారాల బదలాయింపు రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలకు వదిలివేయడం రాజ్యాంగ సవరణలోని ప్రధాన లోపం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994 విషయానికి వస్తే ఇదికొత్తగా చేయబడిన చట్టం కాదు. పాత చట్టాల అతుకుల బొంత.

అప్పటి వరకూ అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీల చట్టం-1964, ఆంధ్రప్రదేశ్ మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజా పరిషత్, జిల్లా ప్రణాళిక అభివృద్ధి సమీక్షా మండళ్ల చట్టం- 1986లను కలిపి 73వ రాజ్యాంగ సవరణలకు అనుగుణంగా ఒకే చట్టంగా రూపొందించారు. ఒకే చట్టమైతే రూపొందించారు. కానీ పాత చట్టాల కింద ఏర్పాటైన అధికార వ్యవస్థలు అయిన పంచాయితీ, అభివృద్ధి విభాగాలను ఏకీకృతం చెయ్యలేదు. ఫలితంగా రెండు విభాగాల అధికార వ్యవస్థలు కుమ్ములాడుకొని మొత్తం వ్యవస్థనే సర్వనాశనం చేశాయి. ఈ చట్టం మార్పులో జరిగిన మరో పొరబాటు ఏమిటంటే మూడు అంచెల మధ్యా అవినాభావ సంబంధాన్ని తుంచివేయడం. గ్రామ పంచాయితీలో ఎంపీటీసీకి, సర్పంచ్‌కి మండల ప్రజాపరిషత్‌లో, జెడ్పీటీసీకి మండల ప్రజాపరిషత్‌లో, ఎంపీపీకి జిల్లా ప్రజాపరిషత్‌లో సభ్యత్వం కల్పించకుండా వారిని 'శాశ్వత ఆహ్వానితులు'గా చేశారు. అందువలన సర్పంచ్‌లు, మండల ప్రజాపరిషత్ సమావేశాల్లోనూ, ఎంపీపీలు జిల్లా ప్రజాపరిషత్ సమావేశాల్లోనూ పాల్గొనటానికి ఆసక్తి చూపించడం లేదు. పాల్గొన్నా ఓటుహక్కు లేకపోవడంతో విలువ లేదు. ఈ కారణంగా మూడు అంచెల వ్యవస్థల మధ్య ఉండాల్సిన అవినాభావ సంబంధాలు తెగిపోయి ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. చేసే పనుల్లో, కార్యక్రమాల్లో మూడు వ్యవస్థల మధ్య సమన్వయం పూర్తిగా కరువయింది.

73వ రాజ్యాంగ సవరణ గ్రామ సభకు రాజ్యాంగ ప్రతిపత్తి, ప్రాధాన్యాన్ని కల్పించింది. గ్రామసభను ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి వేదికగా, గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా భావించింది. గ్రామపంచాయితీలో ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ గ్రామ సభ సభ్యులే. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలో సంవత్సరంలో రెండుసార్లు గ్రామ సభ తప్పనిసరిగా నిర్వహించాలని నిర్దేశించారు. తర్వాత సంవత్సరానికి నాలుగుసార్లు అంటే ప్రతీ మూడు నెలలకు తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే గ్రామసభ ఆచరణసాధ్యంకాని వ్యవస్థగా తయారైంది. గ్రామసభల నిర్వహణకు పలు ప్రతిబంధకాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి- గ్రామ పంచాయతీ భౌగోళిక స్వరూపం, ఓటర్ల సంఖ్య, ప్రజల భాగస్వామ్యం. మన గ్రామ పంచాయతీల విస్తీర్ణాన్ని గమనిస్తే ఒక చిన్న కుగ్రామం నుంచి అనేక ఆవాసాలతో కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న అనేక ప్రాంతాలు ఉంటాయి. అలాగే గ్రామ సభ సభ్యులు- 300 నుంచి 15 వేలకు పైబడిన ఓటర్లు ఉన్న గ్రామపంచాయతీలు ఉన్నాయి. వేల సంఖ్యలో సభ్యులు ఉన్నచోట గ్రామసభ నిర్వహించడం, నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదు. అసలు సమస్య ప్రజల భాగస్వామ్యం. అనుభవం చెబుతున్నది ఏమిటంటే గ్రామసభలకు ప్రజలు హాజరు కారు. బలవంతంగా తరలించినా పట్టుమని పాతికమంది హాజరుకావడం కష్టం. ఇందుకు అనేక సామాజిక, రాజకీయ కారణాలు ఉన్నాయి. వీటితోబాటు, ప్రజల ముందు అన్నీ ఉంచటానికి పంచాయతీ పాలకవర్గం అయిష్టత, ఫలితంగా గ్రామసభల నిర్వహణ ఒక ప్రహసనంగా మారిపోయింది.

పంచాయతీరాజ్ చట్టం గ్రామ సభకు కోరం నిర్ణయించ లేదు. దీని పర్యవసానం నోటీసు ఇచ్చిన గ్రామ సభ జరిగిపోయినట్లుగా నమోదు చేసుకోవచ్చు. ఈ మధ్య కేంద్రప్రభుత్వం కనీసం పదిశాతం కోరంగా ఉండాలని అప్పుడే గ్రామసభ నిర్వహించాలని గట్టిగా చెబుతున్నది. అలాగే గ్రామసభ సభ్యుల్లో పదిశాతం మంది కోరితే వారి కోరిక మేరకు వారు కోరిన అంశాలపై గ్రామసభ

నిర్వహించాలి అని పంచాయతీరాజ్ చట్టం చెబుతున్నది. అసలు ఈ పదిశాతం ప్రజాస్వామ్యం ఏమిటో, గ్రామ స్వరాజ్యంను అది ఎలా ప్రతిబింబిస్తుందో అర్థం చేసుకోవడం కష్టమే. భారత రాజ్యాంగం మౌలికంగా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. (అందుకు విరుద్ధంగా ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని అధిక జనాభా కలిగిన మనదేశంలో, అదీ గ్రామీణ ప్రాంతాలలో అమలు చెయ్యాలనుకోవడంలో ఔచిత్యం కనిపించడం లేదు)

73వ రాజ్యాంగ సవరణ ఫలితంగా రెండు కొత్త ప్రాతినిధ్య వ్యవస్థలు-మండల పరిషత్ ప్రాదేశిక నియోజవర్గ సభ్యుడు(ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు(జెడ్పీటీసీ) సృష్టించబడ్డాయి. ఈ కారణంగా ప్రాతినిధ్య వ్యవస్థలో కొంత గందరగోళం నెలకొని ఉంది. ఇవి, ఆరోవేలు లాంటివనే అభిప్రాయం ఒకటి గట్టిగా ఉన్నది. కొత్తగా పుట్టిన ఎంపీటీసీ/జెడ్పీటీసీ వ్యవస్థలు నిరర్థకమైనవి అనే భావన బలంగా ఉంది. అయితే ఈ వ్యవస్థలను సృష్టించటం వెనుక ఉన్న నిగూఢ లక్ష్యాలు అర్థం చేసుకునే ప్రయత్నం లేదు. ఆ నిగూఢ లక్ష్యాలు ఏమిటి? సర్పంచికి, ఎంపీటీసీకి మధ్య అనివార్య పోటీ లేక ఘర్షణ వాతావరణం నెలకొల్పడం. ఈ పోటీ లేక ఘర్షణ ప్రజలకు మంచి చేస్తుందని నమ్మకం; ఒకే నియోజకవర్గం నుంచి ఇద్దరు ప్రజాప్రతినిధులలో ఒకరు స్థానిక వ్యవహారాలు చూసేందుకు, ఇంకొకరు ఉన్నత పాలనా సంస్థలో తమ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడేందుకు ఒకే ప్రతినిధి సర్వంగా మారిపోయి ప్రజలను పీడిస్తే ప్రత్యామ్నాయ ప్రతినిధిని ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు. ఇవేమీ అర్థం చేసుకోకుండా, కొత్త వ్యవస్థలకు జవసత్వాలు సమకూర్చేందుకు కనీసం ప్రయత్నించకుండా వాటిని పురిట్లోనే చంపేశారు? ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు.

73వ రాజ్యాంగ సవరణ లక్ష్యం సంపూర్ణ వికేంద్రీకరణ, పంచాయతీల వ్యవస్థాగత నిర్మాణం, విధులు, నిధులు, సిబ్బంది, స్వయం నిర్ణయాధికారం కలిగి స్థానిక ప్రభుత్వాలుగా రూపొందాలని ఆకాంక్ష. అయితే ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 రూపొందించలేదు, దీన్ని సరిదిద్దే ప్రయత్నం ఇంతవరకు పంచాయతీరాజ్ శాఖ చేయలేదు. రాజ్యాంగం పదకొండవ షెడ్యూల్ ప్రకారాం పంచాయతీలకు బదిలీ చేయాల్సిన 29 అంశాలను యథాతథంగా పంచాయతీరాజ్ చట్టాన్ని ఒకటో షెడ్యూలులో చేర్చి, ప్రభుత్వం అవసరాలను బట్టి ఆయా అంశాలను పంచాయతీలకు బదిలీ చేస్తుందని పేర్కొన్నారు. తర్వాత ఏదో మొక్కుబడిగా పది అంశాలను బదలాయించినట్టుగా ఆదేశాలు ఇచ్చారు. కానీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి. చట్టం రెండో షెడ్యూల్లో మండల పరిషత్ నిర్వర్తించాల్సిన 15 అంశాలు/విధులు పేర్కొన్నారు. కానీ ఆయా శాఖల తాలుకా నిధులుగాని, సిబ్బందిని గాని మండల పరిషత్ నియంత్రణలో ఉంచలేదు. ఫలితంగా తేలేది ఏమిటంటే మూడు అంచెల వ్యవస్థలో దేనికీ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న 29 అధికారాలు, నిధులు, విధులు, సిబ్బంది చట్టపరంగా దఖలు పరచలేదు. 73వ రాజ్యాంగ సవరణకు ముందు ఉన్న పరిస్థితే ఇప్పటికీ కొనసాగుతున్నది.

73వ రాజ్యాంగ సవరణ అనంతరం ప్రభుత్వ పాలనా విధానాలలోనూ, వాటి అమలు, పర్యవేక్షణ, సమీక్షా పద్ధతుల్లోనూ పెను మార్పులు వచ్చాయి. ముఖ్యంగా సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ రంగంలో సాధించిన ప్రగతి రియల్ టైమ్ గవర్నెన్స్‌కు తెరలేపింది. ప్రజల వద్దకు పాలన నుంచి గడప వద్దకే పాలనకు వచ్చాం. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం అనేది మాయమైపోయింది. కేంద్రీకృత పాలన వికేంద్రీకృతమై ప్రజల ముంగిట్లోకి వచ్చింది. సోషల్ మీడియా విస్ఫోటనం ప్రభుత్వ పాలనతో ప్రజల భాగస్వామ్యం అనే పదానికి అర్థం మార్చేసింది. రియల్‌టైమ్ గవర్నెన్స్ లాగే రియల్ టైమ్ ప్రజల భాగస్వామ్యం నడుస్తోంది. ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ జిల్లాలు చిన్నవైపోయాయి. అలాగే పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పంచాయతీరాజ్ సంస్థలను పునర్ నిర్వచించాల్సిన ఆవశ్యకత ఉంది. అలా అని ప్రభుత్వపాలన, ఈ వ్యవస్థల అవసరం తీరిపోయిందని అనలేం. కానీ వీటి ప్రాధాన్యత ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పునర్ నిర్వచించాల్సి ఉంది. ఈ వ్యవస్థలు నిర్వర్తించాల్సిన అంశాలు ఇప్పటికీ చాలానే ఉన్నాయి. అవేమిటో అధ్యయనం చేసి, తదనుగుణంగా చట్ట సవరణ చేయాలి. మారిన రాజకీయ, సామాజిక, సాంకేతికత పరిస్థితులకు అనుగుణంగా ఈ వ్యవస్థలను తీర్చిదిద్దాలి.

ఏది ఏమైనపట్టకీ, పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి పునాది. దేశ ప్రజాస్వామిక మనుగడ పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరు మీదే ఆధారపడి ఉంటుంది. భావితరాలను సృష్టించేది ఈ వ్యవస్థలే. ప్రజాస్వామిక నడవడికకు అవి ప్రాథమిక బడులు. దురదృష్టం ఏమిటంటే, ప్రజలు గానీ, ప్రజాప్రతినిధులు గానీ వాటిని అధికార అంచెలుగానే చూస్తున్నారు. సమావేశాలు నిర్వహించి సమస్యలు చర్చించటం, పరిష్కారాలు కనుగొనటం అనే బాధ్యతను మరచి పోయారు. సంకుచిత రాజకీయాలతో పంచాయతీరాజ్ వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. ఇందుకు ప్రజాప్రతినిధుల బాధ్యత ఎంత ఉన్నదో, పంచాయతీరాజ్ అధికారులది కూడా అంతే బాధ్యత ఉన్నది.

**(వ్యాస రచయిత..పంచాయతీరాజ్ విశ్రాంత అధికారి)**

**(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)**

❖

# భారత్‌కి ట్యాక్స్‌పేయర్ ఛాలెంజ్

ఇటీవల ఒక ప్రముఖుడు పన్ను చెల్లింపు గురించి ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో ఆసక్తికర ప్రశ్న ప్రస్తావించారు. తాను కోట్ల రూపాయల పన్ను చెల్లిస్తానని, అయితే ఓసారి ఎయిర్‌పోర్టులో క్యూలో నిలబడకుండా చెకిన్‌కి వెళ్లినందుకు కొందరు ప్రయాణికులు తనను విమర్శించారని, ఏడాదికి తాను రూ.4 కోట్లు పన్ను చెల్లిస్తానని, అంత పన్ను కట్టే తనకు ఆమాత్రం సౌకర్యం పొందే హక్కు ఉండదా అని ప్రశ్నించారు. తాను అంతకు ముందు ఎప్పుడూ అలా క్యూలు ఉల్లంఘించలేదని, ఆరోజు పని హడావుడి వల్ల అలా చేయాల్సి వచ్చిందని తెలిపారు. అప్పటివరకు అదొక్కటే తాను కోరిన ప్రత్యేక సౌకర్యమన్నారు. భవిష్యత్తులోనైనా తనలాగా పన్ను కట్టేవారికి ఒక ప్రత్యేక సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అలా పన్ను చెల్లించేవారికి ప్రత్యేకమైన క్యూ ఉంటే, మిగిలినవారికి స్ఫూర్తి కలిగి తాము కూడా పన్ను కట్టే స్థాయికి ఎదగాలనే భావం వారిలో కలిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని తాను ఆదాయపు పన్ను ఉన్నతాధికారొకరితో పంచుకుంటే, అది మీ కల మాత్రమే, అందుకోసం తమ వద్ద ఎటువంటి ప్రతిపాదనా లేదని తెలిపారన్నారు.

ఇంటర్వ్యూలో ఆ ప్రముఖుడి అభిప్రాయంపై సోషల్ మీడియాలో పెద్ద చర్చే నడిచింది. ఎంత సెలబ్రిటీ అయినా ఇలా నిబంధనలు ఉల్లంఘించటం, తనకు ప్రత్యేక మినహాయింపు సౌకర్యం ఉండాలనటం అపంబద్ధమని కొందరు నెటిజన్లు కామెంట్ చేశారు.

ఏ దేశానికైనా పన్ను చెల్లింపుదారులే వెన్నెముక. అందరూ ప్రత్యక్షంగా పన్నులు కట్టకపోవచ్చు, కానీ పరోక్షంగా పన్ను కట్టనివారు దేశంలో దాదాపు ఉండరు. ప్రత్యక్ష పన్నుల ఆదాయం కీలకం కాబట్టి, మనకు ఆ సంఖ్య ఇంకా పెరగాల్సి ఉంది. కొంతమంది పన్నులు పెంచాలి, డబ్బున్నవాళ్ల మీద సంపద పన్ను విధించాలి, వారసత్వ పన్ను విధించాలి, దీనివల్ల పేదరికం తొలగిపోతుంది, అసమానతలు తగ్గుతాయి అని అంటూ సూచనలిస్తున్నారు. కానీ పేదరికం పోవటానికి, ప్రజల ఆదాయాలు పెరగటానికి అవి మార్గాలు కాదు.

మన దేశంలో పెరగాల్సింది పన్నులు కట్టేవారి మీద ఇంకా పన్నులు వేయటం కాదు, పన్నులు కట్టేవారి సంఖ్యను విస్తరించటం.

పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) వల్ల అవినీతి పోలేదు, ప్రభుత్వం ఘనంగా ప్రకటించిన ఇతరత్రా ప్రకటించిన లక్ష్యాలేవీ నెరవేరలేదు, ప్రజలు అనేక రకాలుగా అవస్థలు




పడ్డారు. కానీ డిజిటలైజేషన్ పెరిగి పన్నులు కట్టేవారి సంఖ్య పెరిగింది. బహుశా డీమానిటైజేషన్ వల్ల ఒరిగిన గణనీయ ప్రయోజనం ఇదొక్కటేనేమో! నోట్ల రద్దును అసమర్థంగా అమలు చేయటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. పన్నులు కడుతున్న సగటు పౌరులేమీ ప్రత్యేక సౌకర్యాలు కోరుకోవటం లేదు.

ఎక్కువ పన్నులు కట్టినందుకు ప్రత్యేక సౌకర్యాలు ఇవ్వాలా, వద్దా అనేది ప్రభుత్వ విచక్షణకు వదిలేసినా, వారిని వేధించకుండా ఉంటే చాలు. కొన్ని దేశాల్లో పన్ను చెల్లించేవారికి ప్రత్యేక గౌరవాలను అమలు చేస్తారు, మన దేశంలో కూడా ప్రశంసాపత్రాలు ఇవ్వటం, కొన్ని సందర్భాల్లో సత్కారాలు వంటివి చేస్తున్నారు. ఇవి ఆహ్వానించదగినవే. అయితే అన్నిటికంటే పెద్ద ప్రోత్సాహకం వారిని వేధించకుండా ఉండటం, ఆ పన్నులకు తగ్గ సేవల్ని అందించటం.

అయితే భారత్‌కి ఈవేళ అత్యంత కీలకమైన లక్ష్యం కొత్తగా పన్నులు చెల్లించేవారి సంఖ్యను విస్తరించటం. ట్యాక్స్‌పేయర్లను తయారుచేసేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి. ట్యాక్స్‌పేయర్ అనిపించుకునే స్థాయి, గుర్తింపుని పొందాలని తపిస్తున్నవారు ఈ దేశంలో కోట్ల మంది ఉన్నారు. వివిధ కారణాల వల్ల అవకాశాల్ని అందుకోలేని వీరందరి సామర్థ్యం వికసించేలా చేయటానికి చర్యల్ని ప్రభుత్వం సమర్థంగా, వేగంగా చేపట్టటం, సాధ్యమైనంత ఎక్కువమందిని కొత్తగా పన్నులు చెల్లించే పరిధిలోకి తీసుకురావటం ఎంతో అవసరం. కాబట్టి ఈ దేశంలోని కోట్లాది యువత, ఇతర ప్రజానీకం పన్నులు కట్టే స్థాయికి వారి ఆదాయాన్ని పెంచాలి. ఇదే సమయంలో వారు సంతోషంగా, స్వచ్ఛందంగా పన్నులు కట్టే వ్యవస్థను

నిర్మించాలి.
ఇందుకు అన్ని అవకాశాలూ ఉన్న అద్భుత కాలంలో ఈవేళ భారత్ ఉంది. ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరిగేందుకు దేశంలో సానుకూల వాతావరణం ఉంది. ప్రభుత్వాలు మరీ భయంకర తప్పులు చేయకుండా ఉంటే, మన ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడగలు గుతుంది. అయితే ఇందులో అందరికీ భాగస్వామ్యం ఉంటేనే, ప్రభుత్వానికి పన్నులు గరిష్ట సంఖ్యలో సమకూరి, స్థిరంగా పన్ను ఆదాయం లభిస్తుంది. పన్నుల ద్వారా ఎంత ఎక్కువ ఆదాయం ఉంటే, ఆ దేశం అంత ఆరోగ్యకరంగా ఉన్నట్లు. ఆర్థిక వ్యవస్థ సుస్థిరాభివృద్ధి పౌరుల్లో దాదాపు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కట్టే పన్నుల ద్వారా పన్నుల ద్వారా, అందుకు అవసరమైన సమ్మిళిత అభివృద్ధి ద్వారా మాత్రమే సాధ్యమవుతాయి.
ఈ సమ్మిళిత అభివృద్ధి కోసం ప్రభుత్వం ముందు మౌలిక సదుపాయాల్ని పెంపొందిస్తూ పెట్టుబడుల్ని ప్రోత్సహించటం అవసరం. ప్రభుత్వమే అన్నీ చేయాలనుకోకుండా, ప్రజల శక్తిని వెలికితీసేలా వ్యవహరించాలి. వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాల్ని కూడా ఈ తీరుగా ప్రజల్లో స్వావలంబన పెంచే రీతిలో వినూత్నంగా రూపొందించాలి. ఇదేసమయంలో అప్పు చేసి సంక్షేమాన్ని అమలు చేసే విధానాల్ని పూర్తిగా కట్టడి చేయాలి. రాష్ట్రాలు, యూనియన్ ప్రభుత్వం విధిగా ఈ నిబంధనకు లోబడి ఉండేలా చట్టబద్ధ ఏర్పాటు చేయాలి. మార్కెట్‌లో స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంపొందించాలి. అందరికీ సమానావకాశాల కోసం నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం ప్రతి బిడ్డకి, ప్రతి కుటుంబానికీ ఎటువంటి వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా అందేలా ఏర్పాట్లు చేయాలి. ఇందుకు ప్రభుత్వానికి పెద్ద ఆర్థిక భారం కూడా ఉండదు. ఎందుకంటే, విద్యలో ఇప్పటికే ప్రభుత్వం తగినంత డబ్బు ఖర్చు పెడుతోంది. ఆరోగ్యంలో కొంతమేర అదనంగా ఖర్చు చేస్తే చాలు. అయితే ఈ రెంటిలో డబ్బును సరైన రీతిలో ఖర్చు చేసేందుకు అవసరమైన సంకల్పాన్ని ప్రభుత్వం ప్రదర్శించాలి. అప్పుడే నాణ్యమైన విద్య, ఆరోగ్యం ప్రజలం దరికీ అందుతాయి. వీటితో పాటు పెట్టుబడులను, ప్రజల్లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ని ప్రోత్సహించటం వల్ల యువతకు అవకాశాలు పెరుగుతాయి. ఇందుకు అవసరమైన మౌలిక వసతుల నిర్మాణంలో అభివృద్ధి, పట్టణీకరణ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

అదే విధంగా పట్టణీకరణ ఉన్నచోటే అభివృద్ధి సాధ్యమవుతుంది. మన దేశంలో పట్టణీకరణ వేగంగా జరుగు తున్న మాట వాస్తవం. కానీ అదే సమయంలో గ్రామీణ జనాభా పెద్దసంఖ్యలో ఉంది. ఇప్పటివరకూ మనం అను సరించిన నమూనా ద్వారా వీరందరినీ పట్టణాల వైపు మళ్లించటం ఆచరణ సాధ్యం కాదు. ఇప్పటి వరకూ మనం ఏం చేస్తున్నాం? ఎక్కడో దూరంగా ఉన్న మహానగరాలకు పొట్ట చేత పట్టుకుని వలస పోవటాన్ని ప్రోత్సాహాన్నిస్తున్నాం. వీరందరితో ఇప్పటికే మన మహానగరాలు కిక్కిరిసి పోయాయి. వలస వెళ్లినవారిలో ఎక్కువమంది అసంఘటిత రంగంలో, తక్కువ ఆదాయాలు పొందుతున్నవారు. ఇదే పద్ధతిలో పట్టణీకరణ జరిగితే పరిష్కారం కాస్తా సంక్షోభమవుతుంది. అందువల్ల మహానగరాల అభివృద్ధిని ప్రోత్సహిస్తూనే, గ్రామాలను పట్టణీకరించేలా నమూనాను మార్చాలి. ఇప్పటివరకూ చేసినట్లు మౌలిక వసతుల్ని, సంస్థల్నీ కొన్ని చోట్లే కేంద్రీకరించకుండా గ్రామాల మధ్యకు తీసుకెళ్లాలి. మన మహానగరాల తర్వాత మనకు ద్వితీయ శ్రేణి నగరాలున్నాయి. అయితే వీటిలో చాలావరకు ఒకప్పుడు పల్లెటూళ్లుగా ఉండి కాలక్రమంలో నగరాలుగా పెరిగినవే. చాలామంది గ్రామాల నుంచి అక్కడికి చదువు, వైద్యం ఇతర అవసరాలకు వెళ్తూండటం వల్ల అవి నగరాలుగా నిలదొక్కుకున్నాయి. అయితే వాటిలో చాలావరకు ప్రణాళిక లేకుండా విస్తరించటం, ఖాళీ స్థలాలు కొరవడటం వల్ల ఒక పరిధి దాటి ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా విస్తరించటం కష్టం. మన దేశంలో పలు నగర ప్రాంతాలు ప్రణాళిక లేకుండా పెరిగినప్పటికీ, అలా స్థలాలు అందుబాటులోలేని నగరాల్లో విస్తరణ ఎక్కువ కష్టం ఉంటుంది. పైగా ఇవి చాలా గ్రామాలకు దూరంగా ఉంటాయి. వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో పట్టణీకరణ గ్రామాలకు అందుబాటులో జరగాలి. ఇందుకు తగ్గట్లు మనం మౌలిక వసతుల పథ కాలను నిర్ణయించుకోవాలి. మన ఆలోచనలకు ఇది ప్రాతి పదిక కావాలి. మాజీ రాష్ట్రపతి డా॥ అబ్దుల్ కలాం గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సదుపాయాలు కల్పించాలని గతంలో పలు సందర్భాల్లో చెబుతుండేవారు. అది అవసరం. వేగంగా పెరుగుతున్న సాంకేతికత వల్ల పట్టణ ప్రాంత సదుపాయా లు అనేకం ఇప్పటికే గ్రామాలకు చేరాయి. కానీ పట్టణీకర ణకు అవి చాలవు. సాంకేతిక, పర్యావరణహిత ఆర్థిక కేంద్రా లుగా ఉండే పట్టణాలను అభివృద్ధి చేయాలి. కానీ మన దేశంలో ఆరు లక్షలకు పైగా ఆవాసాలున్నాయి. ప్రతి గ్రామా న్నీ పట్టణంగా అభివృద్ధి చేయటం అసాధ్యం. ఈ క్రమంలో చిన్న పట్టణాల అభివృద్ధికి మనం ప్రాధాన్యత ఇవ్వాలి.
చిన్న పట్టణాల నిర్మాణానికి ప్రభుత్వాలు లక్షల కోట్లు ఖర్చు పెట్టనక్కర్లేదు. కొన్ని గ్రామాలకు కూడలిలా, వారు తమకు అవసరమైన వృత్తి, వ్యాపార సేవలకు తరచూ వెళ్లే ప్రాంతాలకు తగిన వసతుల్ని అభివృద్ధి చేస్తే చాలు. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఇంత వరకు చేసి, మిగిలిన చోట్ల ప్రజలను ప్రోత్సహించాలి. వారిలోని ఎంటర్ ప్రెన్యూర్‌లే, అంటే ప్రయివేటు వర్గాలు నిర్మాణ రంగం,

ఇతర వ్యాపారాల్లో అభివృద్ధిని సాధించగలరు. చేయగలరు. క్రమంగా అవి వ్యాపార కూడళ్లుగా అభివృద్ధి చెందుతాయి. వీటితోపాటు అత్యాధునిక సాంకేతికత ఎప్పటికప్పుడు అందుబాటులోకి రావటం వల్ల చిన్న పట్టణాలు వేగంగా అభివృద్ధి చెంది ఆధునిక ఆర్థిక కేంద్రాలవుతాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అంతరం తగ్గి సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుంది.

మొత్తంగా, అభివృద్ధి అంటే పట్టణీకరణ; సమ్మిళిత అభివృద్ధి అంటే, గ్రామాలు-పట్టణాలు మధ్య అంతరం తగ్గటం.

**సంక్షేమ పథకాల్లో సంక్షేమం ఎంతో నిగ్గు తేల్చే చర్చ అవసరం**

ఈ రకమైన అభివృద్ధి జరుగుతున్నా, సంక్షేమం అవసరమవుతుంది. అయితే, అభివృద్ధిని పణంగా పెట్టకుండా, అప్పులు తెచ్చిన డబ్బును భవిష్యత్తు పెట్టుబడుల కోసం కాకుండా వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాల్ని అమలుకు ఖర్చు చేయకుండా వాటి మధ్య సమతూకాన్ని పాటించాలి. అదేవిధంగా విపరీత రాజకీయ పోటీ ఉన్న మనలాంటి మనలాంటి దేశంలో ఎన్నికల్లో ఎలాగోలా గెలిచేందుకు ప్రజలను ప్రలోభపెట్టటం, వారిలో ఎదగాలనే తపనను నిర్వీర్యం చేయటం తప్ప అభివృద్ధికి ఏమాత్రం దోహదం చేయని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టటం ఆనవాయితీగా మారింది. ఈ ధోరణిని మార్చి, ప్రతి సంక్షేమ పథకం ప్రజలు తమ శక్తిసామర్థ్యాలను వికసింప చేసుకునేలా, అవకాశాల్ని అందుకోగలిగేలా, సృష్టించుకోగలిగేలా, ఆదాయాల్ని పెంచుకోగలిగేలా రూపొందించాలి. అంతిమంగా, ప్రజాస్వామ్యంలో పరిపాలన లక్ష్యమైన ప్రజల సాధికారతను, అంటే ప్రజలు నిరంతరం అర్థించేవారుగా కాకుండా తమ కాళ్ల మీద తాము నిలబడేవారుగా తయారుచేసేలా సంక్షేమ పథకాలు ఉండాలి. ఈ రకమైన పరిస్థితుల్లో పన్నులు కట్టేవారి సంఖ్య వేగంగా, గణనీయంగా పెరుగుతుంది. ఒకసారి వారికి తగిన ఆదాయం లభించాక వారు మరింత చొరవతో వ్యవహరించగలరు, మెరుగైన, సరైన నిర్ణయాలు తీసుకునే ధైర్యాన్ని ప్రదర్శించగలరు. కొనుగోలు శక్తిని కొన్ని రెట్లు పెంచుకోగలరు, దీంతో ఆర్థిక వ్యవస్థ మరింత విస్తరిస్తుంది. అభివృద్ధి వలయం రూపు దిద్దుకుని ప్రజలు సుస్థిరాభివృద్ధిని సాధించుకోగలుగుతారు.

**ఎగవేతలు లేకుండా అందరూ పన్ను కట్టాలంటే..**

ఈ రకమైన చర్యలతో పన్నులు కట్టేవారి సంఖ్య వేగంగా, గణనీయంగా పెరుగుతుంది. కానీ, వారి సంఖ్య గరిష్ట స్థాయికి చేరదు. పన్ను ఎగవేతలు కొనసాగుతుంటాయి. అలా పన్ను కట్టేవారి సంఖ్య గరిష్ట స్థాయికి చేరాలంటే, ప్రజలు పన్ను ఎగవేతల కోసం మార్గాలు వెతకకుండా పూర్తిస్థాయిలో చెల్లించాలంటే, ప్రభుత్వం ఇంకొన్ని పనులు చేయాలి.

దీనికోసం ప్రభుత్వం ఏదో భారీ సాహసాలు చేయనక్కర్లేదు, ఒక ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వం తన బాధ్యతలో భాగంగా చేయాల్సిన పనులు చేస్తే చాలు. అయితే అవి మొక్కుబడిగా కాకుండా, సమర్థంగా, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వినూత్న పద్ధతుల్లో చేయాలి. పారదర్శకంగా, జవాబుదారీతనంతో చేయాలి. అంటే, పౌరులు కేంద్రంగా పరిపాలన నిర్వహించాలి. పౌర సేవలు సమర్థంగా, నాణ్యతతో అందేలా చేయాలి. మన దేశంలో ఇవన్నీ కాగితం మీద ఉన్నాయిగానీ, వీటిని సమర్థంగా అందించేందుకు కావలసిన సంస్థాగత ఏర్పాట్లు చేయలేదు. ఈ ఏర్పాట్లు చేయకపోవటం వల్ల ప్రభుత్వోద్యోగులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధుల దయాదాక్షిణ్యాల మధ్య ప్రజలకు పౌర సేవలు అందుతున్నాయి. ఇందుకోసం సిటిజన్ చార్టర్లను రూపొందించినా అవి కూడా కాగితాలకే పరిమితమయ్యాయి. చాలాచోట్ల నోటీసు బోర్డులు కూడా లేవు. ప్రపంచంలో ఏ చెప్పుకోదగిన దేశంలోనైనా సేవాభావం గలవారు, తమ జీవితాల్లో కొన్ని వ్యక్తిగత సుఖాలను సైతం పణంగా పెట్టగలవారు మాత్రమే ప్రభుత్వోద్యోగాల్లో ప్రవేశిస్తారు. కానీ మన దేశంలో మాత్రం అవి కష్టంలేని సుఖంగా, అదే సమయంలో మిగిలిన ప్రజానీకంలో ఎనభై, తొంభై శాతం కంటే భద్రతతో, వారి పన్నుల డబ్బుతో వారికి సేవ చేయటం కాకుండా జవాబుదారీతనంలేని పెత్తనం చెలాయించేందుకు, చాలా సందర్భాల్లో అక్రమ ఆదాయాన్ని ఆర్జించటానికి మార్గాలు. అందువల్లే సేవ కన్నా స్వార్థానికి, మంది హితం కన్నా సొంత సుఖానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేలా మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ నడుస్తోంది. స్థానికంగా ఏ కీలక పౌర సేవకు సంబంధించి స్పష్టత కావాలన్నా, ముఖ్యమంత్రో, ఆయన అనుగ్రహం ఉన్న మంత్రో, లేదంటే ఎమ్మెల్యేనో స్పందించాలి తప్ప, స్థానికంగా ఎవరి చేతు ల్లోనూ ఉండదు. అదేవిధంగా చాలా సందర్భాల్లో ఏ రాజ కీయ జోక్యం లేకుండా, లంచాలివ్వకుండా ప్రభుత్వ కార్యా లయాల్లో వెంటనే పనిజరిగే వ్యవస్థ నిర్మాణం చేయలేదు. సాంకేతిక వినియోగం పెరిగాక చాలా సేవల్లో పరిస్థితి కొంత మెరుగుపడినా, ఇంకా చాలా మార్పు రావాల్సి ఉంది.

క్రమంగా కీలక సేవలన్నిటినీ స్థానిక పాలన పరిధిలోకి తేవాలి. ప్రజల జీవితాల్లో 80 శాతం వరకు స్థానిక అవసరాలే ఉంటాయి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో కొన్ని కీలకాంశాలున్నా, ప్రధానంగా స్థానికంగా తమ రోజువారీ జీవితావసరాలు, నాణ్యమైన జీవన ప్రమాణాల కోసమే వారు ప్రధానంగా పన్నులు కట్టేది. పౌర సేవల్లో అత్యంత కీలకమైన రోజువారీ సేవలు అందించటంలో ప్రభుత్వ ఉద్యోగుల్లో అత్యధికులు తరచూ విఫలమవుతున్నారు.

ఎప్పుడైతే ఈ సేవలు సక్రమంగా అందటంలేదో, ప్రత్యక్ష పన్నులు కట్టేవారు ఎంత వీలైతే అంత ఎగ్గొట్టాలని చూస్తారు, కొత్తవారు ఆ పరిధిలోకి రాకుండా తప్పించుకోవటానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు. కాబట్టి పన్నులు కట్టేవారి సంఖ్యను విస్తరించటంతోపాటు వారు స్వచ్ఛందంగా పన్నులు కట్టేలా చేయటానికి ప్రభుత్వం పౌర సేవల్ని జవాబుదారీతనంతో మెరుగుపరచాలి. నిధులు, అధికారాలతో స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చి క్రమం గా విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాలను కూడా వాటి పరిధిలోకి తేవాలి.

**వార్డు స్థాయి వరకూ..**

ఈ సేవలు సక్రమంగా అందేందుకు వీలుగా, చిన్న గ్రామాలను, తండాలను విలీనం చేసి పెద్ద పంచాయతీలుగా మార్చాలి, పంచాయతీల క్లస్టర్, చిన్న పట్టణాలు యూనిట్‌గా స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠం చేయాలి. అదే విధంగా మహానగరాలలో వార్డు స్థాయి వరకూ వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి. వీటన్నిటిలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా కమిటీలను రూపకల్పన చేసి బాధ్యతలను నిర్దిష్టంగా నిర్వచించి వారికి అప్పచెబితే, అవసరమైన సేవలు తేలిగ్గా అందరికీ అందుబాటులోకి వస్తాయి. ఉదాహరణకు, మద్యనియంత్రణ, శాంతి భద్రతలు వంటి సేవలకు కమిటీ వేసి ప్రజల ఆధ్వర్యంలో అమలు చేయవచ్చు. దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగం కూడా సమర్థంగా తమ సేవలను అందించగలుగుతుంది. ప్రభుత్వం అంటే దేవుడు, తలచుకుంటే ఎక్కడి నుంచైనా డబ్బు తెచ్చి పంచుతుంది, గతిలేక ఎన్నికల్లో ఓటు వేస్తున్నాం అనే అభిప్రాయాల స్థానంలో ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతి రూపాయి వివిధ రూపాల్లో మనం చెల్లించే పన్నులు లేదా మన వనరులు, మన డబ్బు అనే అవసరం, పరిమితులు, మెరుగైన ఫలితాలు సాధించే అవకాశాలు అనే ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. అలాంటప్పుడు పరిమిత వనరుల్లో అపరిమిత ఫలితాల్ని సాధించేలా పన్నుల డబ్బును సద్వినియోగం చేయటంతోపాటు ప్రజల్లో కలిగే అవకాశాల్ని పెంపొందిస్తారు. దాంతోపాటు కొత్త వనరుల్ని పెంపొందిస్తారు, పన్నుల డబ్బుని సద్వినియోగం చేస్తారు. వారికి కావలసిన అంశాల్లో పన్నులు కట్టటానికి స్వచ్ఛందంగా ముందుకొస్తారు.

**ఈ ఒక్క విషయం అర్థమైతే మొత్తం రాజకీయం మారిపోతుంది**

ఎప్పుడైతే ప్రజలు తాము కట్టే పన్నుల డబ్బుకి, తాము వేసే ఓటుకి మధ్య సంబంధాన్ని అర్థం చేసుకుంటారో, మొత్తం రాజకీయం మారిపోతుంది. అన్ని ఎన్నికల సంస్కరణల సారాంశం అదే. ఈ లక్ష్యం కోసమే ఇప్పుడు మనం ఎన్నికల

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 19 వరకు నికర లాభం ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ,11.25 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. గత ఆర్థిక సంవత్సరానికి ఇదే సమయంలో వసూళ్లు 9.51 లక్షల కోట్లతో పోలిస్తే 18.3% ఎక్కువ. తాజా వసూళ్లలో వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 5.98 లక్షల కోట్లు కాగా, కార్పొరేట్ పన్నులు 4.94 లక్షల కోట్లు.**

**() ఏప్రిల్ 1 నుంచి స్థూల ప్రత్యక్ష పన్నులు 22.3% అధికమైన రూ.13.57 లక్షల కోట్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.22.07 లక్షల కోట్లకు చేరవచ్చని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.**

సంస్కరణల గురించి మాట్లాడుకుంటున్నాం. నేను వేసే ఓటు ద్వారా నా పన్నుల డబ్బుతో ఏం జరుగుతోందో నాకు అర్థమైతే ఏ ప్రజాస్వామిక ఎన్నికల వ్యవస్థ ఉన్నా కూడా ఓటర్ల తీర్పు పరిణతితో ఉంటుంది. ఒక సువిశాల దేశంలో, ప్రజాస్వామ్య అనుభవంలేని దేశంలో, అపారమైన అవిద్య, పేదరికం ఉన్న దేశమైనప్పటికీ తొలి నుంచి అందరికీ ఓటు హక్కును ఇచ్చే సాహసం చేసిన దేశంలో ఓటుకు, తన జీవితానికి మధ్య సంబంధమేంటో అర్థంకాని వ్యవస్థను అప్పుడే నిర్మించకపోవటం వల్ల ఎంతో గందరగోళం చోటు చేసుకుని మనం చాలా నష్టపోయాం. ఆ వ్యవస్థను ఇప్పటి కైనా నిర్మించగలిగితే, పన్నులు డబ్బు కట్టేవారి ఆదాయం భారత్‌కు సుస్థిరాభివృద్ధికి దోహదం చేస్తుంది. ఈ మార్పు వేగంగా రావటం కోసం దామాషా పద్ధతి ఎన్నికల సంస్కరణల్ని తీసుకొస్తే మనం వేగంగా ఆర్థికాభివృద్ధిని అందుకోగలం.

మేం పన్నులు కడతాం, మాకు పన్నులు కట్టే ఆదాయాన్ని ఆర్జించే అవకాశాల్ని మాకు ఇవ్వండి అంటున్న కోట్లాది మంది గుండెగొంతుకను ప్రభుత్వం ఇప్పటికైనా వినాలి. అదేవిధంగా ఆ తర్వాత వారంతా పన్ను పీకించుకున్నట్టు బాధపడకుండా, పన్ను ఎగవేతల గురించి ఆలోచించకుండా స్వచ్ఛందంగా, సంతోషంగా పన్నులు చెల్లించటం కోసం పౌరులు కేంద్రంగా నాణ్యమైన, జవాబుదారీతనంతో కూడిన సేవల్ని సక్రమంగా అందించాలి. ఈ రకంగా చేస్తే, ప్రత్యేకించి గౌరవాలు అవసరం లేకుండానే ప్రతి ఒక్కరూ పన్ను కట్టటాన్నే గౌరవంగా భావిస్తారు. ఇలాంటి పాలన కొనసాగుతూ, రాజకీయం అందుకోసం పనిచేస్తుంటే ఈవేళ క్యూల్లోనో, మరో చోట తమకు మినహాయింపు, ప్రత్యేక ప్రజలు సౌకర్యం ఉండాలని కోరుకుంటున్న సెలబ్రిటీలు, వీఐపీలు కూడా ఎటువంటి డిమాండ్లూ లేకుండా సంతోషంగా పన్నులు కడతారు. ❖

# బాలికల చదువు - దేశానికి వెలుగు

- జాన్ రాబర్ట్స్-

**భారతదేశం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. విద్యా రంగంలోనూ ఎంతో పురోగమిస్తోంది. కానీ సార్వత్రిక విద్య విషయంలో అనేక సమస్యలు అలాగే ఉన్నాయి. ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన బాలికల చదువు విషయంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. మన దేశంలో ప్రాథమిక విద్య స్థాయిలో బాలికల నమోదు గణనీయంగా పెరిగింది. కానీ ఆ పై తరగతులకు వచ్చే సరికి బాలికలు చదువు కొనసాగించడం కష్టమవుతోంది. అనేక ఆర్థిక సామాజిక సాంస్కృతిక అడ్డంకులతో వారి చదువులు అర్థంతరంగా ఆగిపోతున్నాయి. వారి భవిష్యత్తు అనిశ్చితంగా మారుతోంది.**

యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (UDISE) 2021-22 గణాంకాల ప్రకారం మన దేశంలో ప్రాథమిక స్థాయి విద్యలో బాలికల స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్రేషియోGER) 101.1 శాతంగా ఉంది. కానీ, ఈ నమోదు ప్రాథమికోన్నత స్థాయిలో 79.4 శాతానికి తగ్గిపోతోంది. ఆపైన ఉన్నత పాఠశాల స్థాయిలో 58.2 శాతానికి పడిపోతోంది. అలాగే, ప్రాథమిక స్థాయిలో బాలికల డ్రాపవుట్ రేటు 1.4 శాతంగా ఉంటే, ప్రాథమికోన్నత స్థాయిలో 3.3 శాతంగా ఉంది. ఇక ఉన్నత పాఠశాల స్థాయికి వచ్చేసరికి ఈ డ్రాపవుట్ రేటు 12.3 శాతానికి పెరిగిపోతోంది.



**రెండు విధాల వివక్ష...**

ముఖ్యంగా అట్టడుగు వర్గాలు, వెనుకబడిన వర్గాలకు (ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు) చెందిన బాలికలు, పేద వర్గాల వారిలో డ్రాపవుట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ వర్గాలకు చెందిన బాలికలు రెండు విధాల వివక్షకు (డబుల్ మార్జినలైజేషన్) గురవడం స్పష్టంగా కనిపిస్తుంది. అంటే ఒకటి కులం వల్ల, రెండోది బాలిక అయినందువల్ల.. వీరు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. బాలికలు అర్థంతరంగా బడికి దూరం కావడం వల్ల.. బాల్య వివాహాలు, టీనేజీ గర్భాలు, తగిన వయసు రాకముందేతల్లులవడం, బాల కార్మికులుగా మారడం, అక్రమ రవాణాకు గురవడం వంటి ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవడం అధికంగా ఉంటుంది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక (నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే- NFHS-5) ఈ అసమానతలను ప్రతిబింబిస్తోంది. ఆ నివేదిక ప్రకారం.. 6 నుండి 10 సంవత్సరాల వయస్సు గల బాలికలలో 83 శాతం మంది ప్రాథమిక పాఠశాలలకు హాజరవుతుండగా, 11 నుండి 17 సంవత్సరాల వయస్సు గల బాలికలలో సెకండరీ పాఠశాలకు హాజరవుతున్న వారి సంఖ్య 70 శాతానికి తగ్గిపోయింది. పేదరికం, లింగ వివక్ష, కుల వివక్ష, ప్రాంతీయ అసమానతలు సహా అనేక సామాజిక-ఆర్థిక అంశాలు.. బాలికల చదువు మీద ప్రభావం చూపుతున్నట్లు ఈ నివేదిక చెప్తోంది.

**ఉన్నత లక్ష్యాలు**

ఈ సవాళ్లకు ప్రతిస్పందనగా, 2020లో ప్రకటించిన జాతీయ విద్యా విధానం (NEP) 3 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ సార్వత్రిక విద్యను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. బాల్యం నుండి మాధ్యమిక స్థాయి వరకు సార్వత్రిక విద్యను అందించాలనే సరికొత్త విధానాన్ని ముందుకు తెచ్చింది. 2030 నాటికి ప్రీ-స్కూల్ నుండి మాధ్యమిక స్థాయి వరకూ 100 శాతం (GER) నమోదు సాధించడం, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలను పెంచడం వంటి లక్ష్యాలను నిర్దేశించింది.

ఈ లక్ష్యాలు ప్రాతిపదికగా సమగ్ర శిక్షా అభియాన్ పథకం అమలవుతోంది. మాధ్యమిక విద్య మౌలిక సదుపాయాలను విస్తరించడం, అర్హులైన ఉపాధ్యాయులను నియమించడం, అట్టడుగు వర్గాలలో, ముఖ్యంగా బాలికలు పాఠశాలల్లో కొనసాగే దామాషాను మెరుగుపరచడంపై ఈ కార్యక్రమాలు దృష్టి సారించాయి. ఈ కృషి జరుగుతున్నప్పటికీ, విధానాల రూపకల్పనకు - క్షేత్రస్థాయిలో వాటిని సమర్థవంతంగా అమలు చేయడానికి మధ్య అంతరాన్ని తగ్గించడంలో సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి.

**అవరోధాలు - సవాళ్లు...**

బాలికల విద్యకు ఆటంకం కలిగిస్తున్న సవాళ్లలో సామాజిక-ఆర్థిక అవరోధాలు ప్రధానమైనవి. ప్రముఖ భారతీయ స్వచ్ఛంద సంస్థ చైల్డ్ రైట్స్ అండ్ యు (CRY) 2021లో తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన జిల్లాల్లో ఒక సమగ్ర అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనంలో వెలుగు చూసిన అంశాలతో 'మాధ్యమిక విద్య డిమాండ్-అవరోధాలు, సవాళ్లు' అనే పేరుతో ఒక నివేదిక రూపొందించింది.

**సామాజిక-ఆర్థిక సవాళ్లు...**

చాలా పేద కుటుంబాలు తమ కూతురు చదువు కోసం ఖర్చు పెట్టడం ఆమెను సాధికారం చేసే మార్గంగా కాకుండా తమపై ఆర్థిక భారంగా భావిస్తున్నాయి. మధ్యలో బడి మానేసిన వారిలో 76 శాతం మంది బీపీఎల్, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులను

కలిగి ఉన్న బలహీన వర్గాల ఇళ్ల వారేనని ఈ అధ్యయనం వెల్లడించింది. అలాగే, బడి మానేసిన పిల్లల్లో 42 శాతం మంది కుటుంబాల నెల వారీ ఆదాయం రూ. 5,000 కన్నా తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. ఇది ఆర్థిక అసమానతలు చిన్నారుల చదువుపై చూపుతున్న ప్రతికూల ప్రభావాన్ని ఎత్తిచూపుతోంది.

సామాజిక తరగతుల పరంగా, డ్రాపవుట్ పిల్లల్లో 20 శాతం మాత్రమే జనరల్ కేటగిరి కుటుంబాలకు చెందిన వారు కాగా.. ఎక్కువ మంది ఎస్సీ (29%), ఎస్టీ (18%), ఓబీసీ (31%) కుటుంబాలకు చెందినవారని ఆ అధ్యయనం చెబుతోంది. ఈ కుటుంబాలు తరచూ పాఠశాల విద్యకు సంబంధించిన ఖర్చులను భరించలేక పిల్లలను చదువుకు దూరం చేస్తున్నాయి. ఈ ఖర్చులలో స్కూలు ట్యూషన్ ఫీజు మాత్రమే కాకుండా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ప్రయాణం, కోచింగ్ ఖర్చులు కూడా ఉంటాయి.

ఈ అధ్యయనం ప్రకారం, 29 శాతం మంది తల్లిదండ్రులు తమ కుమార్తెలు బడి మానేయడానికి కారణం పాఠశాల ఫీజు చెల్లించలేకపోవడమేనని చెప్పారు. మరో 16 శాతం మంది తల్లిదండ్రులు తమ కుమార్తెలు కూడా ఏదో ఒక పని చేసి కుటుంబ ఆదాయానికి చేదోడుగా ఉండాలని కోరుకున్నారు. మధ్యలోనే చదువు ఆపేసిన బాలికల్లో సైతం 27 శాతం మంది తమ తల్లిదండ్రులకు ఫీజు కట్టే శక్తి లేకపోవడమే తాము బడి మానేయడానికి ప్రధాన కారణమని చెప్పారు. మరో 19 శాతం మంది కుటుంబం గడవడానికి తాము కూడా పని చేయాల్సిరావడం వల్ల చదువు మానేశామని చెప్పారు.

పిల్లల చదువు కోసం, ముఖ్యంగా బాలికల చదువు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు, కల్పిస్తున్న సదుపాయాల గురించి సరైన అవగాహన లేకపోవడం కూడా బాలికల చదువు మీద ప్రతికూల ప్రభావం చూపుతోందని పై అధ్యయనం చెప్తోంది.

**మౌలిక సదుపాయాల లేమి, భద్రత భయాలు...**

పాఠశాలలకు సంబంధించిన మౌలిక సదుపాయాల లోపాలు కూడా బాలికల చదువుకు ఆటంకం కలిగిస్తున్నాయి. బాలికలు నివసిస్తున్న ప్రాంతానికి సమీపంలో సెకండరీ లేదా హయ్యర్ సెకండరీ తరగతులు అందుబాటులో లేకపోతే.. వారి చదువు ఆగిపోతోందని అధ్యయనంలో వెల్లడైంది.

అధ్యయనం చేసిన నాలుగు రాష్ట్రాల్లోనూ.. 8వ తరగతి పూర్తి చేసిన తర్వాత చదువు ఆపేసిన బాలికలలో 31 శాతం మంది తాము చదువుకున్న పాఠశాలలో అంతకుమించి తరగతులు లేవని తెలిపారు. అలాగే, 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత చదువు ఆపేసిన బాలికల్లో 73 శాతం మంది.. తమ పాఠశాలలో 10వ తరగతి తర్వాత పై తరగతులు లేవని చెప్పారు.

ఇక ప్రత్యేకంగా బాలికల పాఠశాల లేకపోవడం వల్ల.. తమ కుమార్తెల భద్రత గురించి ఆందోళనల కారణంగా తల్లిదండ్రులు వారిని బడికి పంపడం లేదని కూడా అధ్యయనం కనుగొంది. కో-ఎడ్యుకేషన్ పాఠశాలల విషయంలో పిల్లల ప్రేమ వ్యవహారాలు, పారిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయేమోననే ఊహాత్మక భయాలు కూడా తల్లిదండ్రుల్లో ఉన్నాయి. కేవలం 25 శాతం మంది తల్లిదండ్రులు మాత్రమే తమ ఇళ్లకు సమీపంలో బాలికల పాఠశాల ఉందని చెప్పారు. మరో 43 శాతం మంది తల్లిదండ్రులు బాలికల పాఠశాలలు 5 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్నాయని చెప్పారు. ఇంకో 13 శాతం మంది అసలు అలాంటి పాఠశాల గురించి తమకు తెలియదన్నారు.

బడికి వెళుతున్న బాలికల్లో 10వ తరగతి చదువుతున్న వారు 15 శాతం మంది, 11వ తరగతి చదువుతున్న వారు 27 శాతం మంది తమ పాఠశాల 5 కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరం ఉందని చెప్పారు. ఇక 10వ తరగతి తర్వాత చదువు ఆపేసిన బాలికల్లో 33 శాతం మంది, 11వ తరగతి తర్వాత చదువు ఆపేసిన బాలికల్లో 50 శాతం మంది తమ పాఠశాలలు 5 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్నట్లు తెలిపారు. అంటే.. బడి దూరమయ్యే కొద్దీ చదువుకు దూరమవుతున్న బాలికల సంఖ్య ఎక్కువవుతోందని వెల్లడవుతోంది. బాలికలు ఎక్కువ దూరం ప్రయాణించడం భద్రం కాదని (దారిలో లైంగిక వేధింపులు, దాడుల ఘటనలకు సంబంధించిన వార్తలు, కథనాల వల్ల) భావించడం ఇందుకు ఒక కారణమయితే.. ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలు ప్రయాణ ఖర్చులను భరించలేకపోవడం మరొక కారణంగా ఉంది.

ఇక చాలా పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు, సురక్షితమైన రవాణా సదుపాయాలు వంటి మౌలిక సౌకర్యాలు కొరవడ్డాయి. ఈ ప్రాథమిక సౌకర్యాల లేమి బడికి వెళ్లే బాలికలకు ఆరోగ్యపరమైన, భద్రతాపరమైన సమస్యలకు కారణమవుతోంది. తల్లిదండ్రులు తమ కుమార్తెలను బడికి పంపించకుండా చేస్తోంది. ముఖ్యంగా బాలికల భద్రత గురించిన ఆందోళనలు ఎక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ కుమార్తెలను బడికి పంపడం మానేస్తున్నారు.

**సాంస్కృతిక అంశాలు, లింగ వివక్ష...**

సమాజంలో లోతుగా పాతుకుపోయిన కొన్ని సంస్కృతీ సంప్రదాయాలు, లింగ వివక్ష కూడా బాలికల చదువుకు బలమైన అడ్డంకులుగా ఉన్నాయి. బాలికలను ఇంటికి పరిమితం చేస్తున్నాయి. ఇంటి పనులు చక్కబెట్టడం, పెద్దవాళ్లకు పనులు చేసిపెట్టడం, పిల్లల బాగోగులు చూసుకోవడం వంటి పనులు ప్రధానంగా బాలికల బాధ్యతే అవుతోంది. బాలికల విషయంలో ఈ సామాజిక వివక్ష.. లింగ అసమానత అనే విషవలయాన్ని శాశ్వతంగా కొనసాగేలా చేస్తోంది. కూతురు చదువు కోసం ఖర్చు పెట్టడం దండగ అని, కొడుకు చదువు కోసం పెట్టుబడి పెట్టడం లాభం అని భావించే ధోరణిని బలోపేతం చేస్తోంది.

ఈ అధ్యయనంలో, తమ కుమార్తెలు చదువు ఆపివేయడానికి ప్రధాన కారణం..వారు ఇంటి పనులు చూసుకోవాల్సి రావడమని 22 శాతం మంది తల్లిదండ్రులు చెప్పగా, తోబుట్టువుల సంరక్షణ చూసుకోవడమని 14 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు. అర్ధంతరంగా చదువు ఆపేసిన బాలికల్లో సైతం.. తాము బడి మానేయడానికి ప్రధాన కారణం ఇంటి పనులు చూసుకోవడమని 26 శాతం మంది చెప్పగా, తమ తోబుట్టువులను చూసుకోవడమని 14 శాతం మంది చెప్పారు.

ఇక బడి మానేసిన బాలికలు, వారి తల్లిదండ్రుల్లో మూడింట ఒక వంతు మంది.. కుటుంబ విలువలు లేదా సమాజ విలువలు (35 శాతం మంది పిల్లలు, 36 శాతం తల్లిదండ్రులు) తాము చదువు ఆపేయడానికి కారణంగా పేర్కొన్నారు.

మరోవైపు.. చట్టపరమైన నిషేధాలు ఉన్నాకూడా బాల్యవివాహాలు ఇప్పటికీ విస్తారంగా కొనసాగుతున్నాయి. ఇది పరిస్థితిని మరింత జటిలం చేస్తోంది. డ్రాపవుట్ అయిన బాలికల్లో 8 శాతం మంది తాము చదువు ఆపేయడానికి కారణం ముందస్తుగా పెళ్లి కావడమేనని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు కావచ్చు, సాంస్కృతిక కట్టుబాట్లు కావచ్చు.. తల్లిదండ్రులు ఇప్పటికీ తమ కుమార్తెలకు చిన్న వయసులోనే వివాహం చేయడానికి మొగ్గు చూపుతున్నారు. పేదరికాన్ని ఎదుర్కోవడానికో, సంప్రదాయాలను పాటించడానికో బాలికలకు త్వరగా పెళ్లి చేస్తున్నారు.

**అడ్డంకులను బద్దలు కొట్టాలంటే...**

బాలికలందరికీ మాధ్యమిక విద్య అందాలన్నా, వారు చదువు మధ్యలో ఆపేయకుండా బడిలో కొనసాగాలన్నా చేస్తున్న కృషిలో లింగ వివక్ష ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఈ సవాళ్లను పరిష్కరించడానికి సంస్థాగత సంస్కరణలు అత్యవసరం. మాధ్యమిక, మాధ్యమికోన్నత పాఠశాలలు, మౌలిక సదుపాయాలను విస్తరించడం, ప్రయాణాల సమయంలో బాలికలకు భద్రతను బలోపేతం చేయడం, స్కాలర్‌షిప్‌ల ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, అందుబాటులో ఉన్న విద్యావకాశాలు, అందుకు గల మద్దతు యంత్రాంగాల గురించి సమాజంలో అవగాహన పెంచడం ఈ సంస్కరణల్లో భాగంగా ఉండాలి.

**ఆర్థిక భారాన్ని తగ్గించడం...**

బాలికల చదువు మీద ఆర్థిక పరిమితులు గణనీయంగా ప్రభావం చూపుతున్నాయి కాబట్టి, స్కాలర్‌షిప్ నిబంధనలను, అర్హతలను సరళీకరించడం చాలా అవసరం. అవి సరిగా ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలి. విద్యాహక్కు చట్టం 2009తో అందరికీ ఉచిత ప్రాథమిక విద్య భరోసా కల్పించింది. అయితే మాధ్యమిక విద్యకు వచ్చేసరికి ఖర్చులు పెరుగుతున్నాయి. ఇది అట్టడుగు వర్గాల కుటుంబాల మీద ప్రతికూల ప్రభావం చూపుతోంది.

జాతీయ విద్యా విధానం 2020 లో పేర్కొన్నట్లుగా, అందరికీ 18 సంవత్సరాల వయసు వరకు సార్వత్రిక విద్య అందించాలంటే.. అట్టడుగు వర్గాల పిల్లలకు పాఠశాలల్లో నమోదు, వార్షిక ట్యూషన్ ఫీజు, పరీక్ష ఫీజు, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, ప్రయాణాలకు సంబంధించిన ఖర్చులు తగ్గాలి. స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రోత్సాహక పథకాల కింద అందించే నిధులు పెంచడం ద్వారా.. ఆర్థిక భారాన్ని తగ్గించడానికి, బాలికలు మాధ్యమిక విద్యను పూర్తి చేయడానికి తోడ్పడవచ్చు. బడికి వెళ్లే బాలికలకు ఉచిత సైకిళ్ళు అందించడం లేదా ఉచితంగా ప్రజా రవాణా సదుపాయాలు కల్పించడం వంటి సురక్షితమైన ప్రయాణ పథకాలను అమలు చేయడం చాలా అవసరం.

**మౌలిక సదుపాయాలను పెంపొందించడం...**

విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడడానికి మరిన్ని మాధ్యమిక పాఠశాలలు, ముఖ్యంగా బాలికల పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచడం, ఇంత దూరానికి ఇన్ని పాఠశాలలు ఉండాలనే నిబంధనల ప్రకారం కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయడం, వాటిలో అవసరమైన మేరకు ఉపాధ్యాయులను నియమించడం అవసరం. పాఠశాలల్లో సైతం మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం కూడా అత్యవసరం. ముఖ్యంగా బాలికలకు ప్రత్యేకంగా, శుభ్రమైన, పనిచేస్తున్న మరుగుదొడ్లు ఉంటే వారి డ్రాపవుట్ రేట్లు గణనీయంగా తగ్గుతాయి.

బాలికలు బడికి వెళ్లిరావడానికి సురక్షితమైన పరిస్థితులు ఉండేలా చూడడానికి సమాజం మరింత క్రియాశీలంగా వ్యవహరించాలి. స్థానిక పోలీసుల నుంచి పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలి. గ్రామ బాలల రక్షణ కమిటీలు (విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు – VCPCలు) వంటి సమాజం పాలుపంచుకునే పిల్లల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి, వారికి తగిన వనరులను సమకూర్చడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఎప్పటికప్పుడు అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించాలి.

**ప్రభుత్వ పథకాలపై అవగాహన...**

బాలికల విద్యను ప్రోత్సహించడానికి అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన పెంపొందించాలి. ఇందుకోసం పాఠశాల స్థాయిలోను, సమాజ స్థాయిలోను సమర్థవంతమైన సంప్రదింపులు, ప్రచారాలు అవసరం. పాఠ్యపుస్తకాల వెనుక అట్టల మీద ప్రభుత్వ పథకాల గురించిన సమాచారాన్ని ముద్రించడం, పాఠశాలల్లో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం చాలా సహాయపడుతుంది.

**సామాజిక ధోరణులను మార్చడం...**

ఇంట్లోను సమాజంలోను కొనసాగుతున్న వివక్షాపూరిత ధోరణులు, సంప్రదాయాలు బాలికల విద్యపై చూపుతున్న ప్రతికూల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని.. వాటిని మార్చడానికి చేస్తున్న కృషిని మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. బాలికలను ఇంటిని చక్కబెట్టే వారిగా, పిల్లల బాగోగులను చూసుకునే వారిగా పరిగణించే సంప్రదాయ దృక్పథం.. వారి చదువుకు ఒక ప్రధాన అవరోధంగా కొనసాగుతోంది.

బాలికలు చదువు పూర్తి చేయాల్సిన ప్రాధాన్యత గురించి అవగాహన పెంచడానికి.. వారి తల్లిదండ్రులతోను, సమాజ సభ్యులతోను, పెద్దలతోను సమర్థవంతమైన సంభాషణ అవసరం. ఈ అంశాలపై పాఠశాలల్లో చర్చలు, అవగాహన తరగతులు తప్పనిసరి చేయాలి. బాలికల విలువను, వారి చదువు విలువను చిన్నచూపు చూసే ధోరణులను మార్చడంపై దృష్టి సారించే బేటీ బచావో బేటీపడావో వంటి కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు మరింతగా విస్తరించాలి.ఇందులో భాగంగా.. బాలల హక్కుల కోసం కృషి చేస్తున్న **భారతీయ స్వచ్ఛంద సంస్థ** (CRY) **– చైల్డ్ రైట్స్ అండ్ యు.. 'బాలికల చదువు దేశానికి వెలుగు' నినాదంతో దేశవ్యాప్తంగా 'పూరీ పడాయి దేశ్ కీ భలాయి' కార్యక్రమాన్ని** చేపట్టింది. సామాజిక వైఖరిని మార్చడంలో, ప్రతి బాలికా మాధ్యమిక విద్యను పూర్తి చేసేలా చూడడంలో ఉమ్మడి కృషి ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం బలంగా చాటింది. ❖

**(వ్యాస రచయిత క్రై – చైల్డ్ రైట్స్ అండ్ యు దక్షిణ విభాగానికి రీజనల్ డైరెక్టర్)**



# ప్రభుత్వ ఉద్యోగాల కోసం జీవితాల్ని వృధా చేసుకోవద్దు

సమాజసేవ పట్ల అంకితభావం ఉంటేనే ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేయాలని, దాన్ని కల గానో, జీవితాశయంగానో భావించి విలువైన సమయం వృధా చేసుకోవద్దని ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ యువతకు హితవు పలికారు. దూరంగా ఉన్న కలెక్టర్ కన్నా మన ఇంట్లో బాత్‌రూంల పూడిక తీసే ప్లంబర్ సేవలు మనకు ముఖ్యమని, కానీ మనం సమాజానికి పనికొచ్చే ఉపాధి అవకాశాలను కించపరుస్తూ ప్రభుత్వోద్యోగాలంటే చాలా గొప్ప అనే భ్రమలో బతుకు తున్నామన్నారు. ప్రభుత్వోద్యోగాలిస్తామని అదే పనిగా ప్రచారం చేసే నేతలను చీపురులతో తరమండి ఎన్నికల్లో చిత్తుగా ఓడించండి అని పిలుపునిచ్చారు. ఉపాధి రంగంలో ప్రభుత్వాల తీరు వల్ల యువతలో గందరగోళం నెలకొందన్నారు. తెలంగాణలో జాబ్ క్యాలెండర్, ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ అంటూ భారీ ప్రకటనలు ఇస్తున్నారని, అందులో ఉన్న ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారో, విద్య ఎలా ఉందో ఒక్క ముక్కా లేదనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు ఎందుకు చేరటం లేదని ప్రశ్నించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు ఆధ్వర్యంలోని 'ది మిషన్' సంస్థ 9వ వార్షికోత్సవాన్ని హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమంలో జేపీతో పాటు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, విశ్రాంత ఐపీఎస్ వి.వి.లక్ష్మీనారాయణ, సీనియర్ జర్నలిస్టు రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th DECEMBER, 2024 Posting Date 15 &16th of every month



Watch @
https://www.youtube.com/@JPLoksatta Official



## Town Hall with JP

## ఊరికో 'కావూరు' తో ప్రతి ఇంటికీ ఉద్యోగం

## Small townsతో Big Job Revolution

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**